హనుమంత.. భక్తుల పులకింత



వాడపల్లి దేవస్థానం ప్రాంగణంలో కథాకళి కళాకారుల నృత్యాలు



ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం వేంకటాద్రి రాయుడు హనుమంత వాహనంపై ఊరేగారు. స్వామి కోదండరామ అలంకారంలో భక్తులను కటాక్షించారు. వాడపల్లి తిరువీధుల్లో వాహనసేవ కొనసాగింది. పండితులు రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, లక్ష తులసి పూజ, నవగ్రహ హోమం జరిగాయి. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సూర్యచక్రధరరావు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ● గురువారం తిరుప్పావడ సేవ, యోగ నారసింహ అలంకారంలో సింహ వాహన సేవ ఉంటాయి.



శ్రీవారికి అభిషేకం

మలేషియా యాత్ర.. మేలెంత!



ప్రతినిధుల ఎంపికలో జేఎన్‌టీయూకే పోకడపై చర్చ

ఈనాడు, కాకినాడ– న్యూస్‌టుడే, గాంధీనగర్: కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూకే)లో తీసుకునే కొన్ని నిర్ణయాలు తరచూ వివాదాస్పదమవుతున్నాయి. 'సాంకేతికత- నాయకత్వం' అంశంపై మలేషియాలో జరుగుతున్న ఐదు రోజుల కార్యశాలకు నిపుణులైన ఆచార్యులు, కీలక విభాగాధిపతులు, నాయకత్వ అర్హత ఉన్నవారిని కాకుండా నచ్చినవారిని పంపించినట్లు తెలుస్తోంది. రూ.లక్షలు పోసి ఏదో విహార యాత్రకు అన్నట్లుగా ఈ ఎంపికలు ఉన్నాయని.. పాలక మండలి అనుమతితో ఇది సాగలేదంటూ ఇన్‌ఛార్జి వీసీ నిర్ణయాన్ని జేఎన్‌టీయూ వర్గాలే తప్పుపడుతున్నాయి. దీంతో మలేషియా పర్యటనతో ఈ విశ్వవిద్యాలయానికి మేలెంత..? అనే అంశం తెరమీదికి వచ్చింది.

ఎవరి సంతృప్తి కోసం..

జేఎన్‌టీయూ విభాగాధిపతులు, బోధన సిబ్బంది.. వారి బోధన, పాలనా విధానాల్లో ఆధునిక ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుని మెరుగైన కార్యకలాపాలు సాగించాల్సి ఉంది. ఇందుకు వీలుగా మలేకా మలేషియా సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఈనెల 20 నుంచి 25 వరకు కార్యశాల నడుస్తోంది. జేఎన్‌టీయూకే నుంచి 13 మంది ప్రతినిధులను పంపారు. రిజిస్ట్రార్, రెక్టార్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌తో పాటు భవిష్యత్తులో నాయకత్వం వహించబోయే ప్రతినిధులను పంపితే ఫలితం ఉంటుందని, కొందరిని సంతృప్తిపరచడానికి దిగువ స్థాయి సిబ్బందినీ, కార్యాలయ సహాయకులను భాగస్వాములను చేశారన్న వాదన వినిపిస్తోంది. జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపల్ ఎం.స్వరూపారాణి సారథ్యంలో.. ఇంటర్నేషనల్ రిలేషన్స్ గౌరవ సలహాదారు ఎస్కే సులేమాన్ మార్గదర్శకత్వంలో బృందం మలేషియా వెళ్లింది. వీసీఈ చీఫ్ ఇంజినీరు, ఎస్ఎంఎస్ డైరెక్టర్, మెకానికల్ వైస్ ప్రిన్సిపల్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్రంథ పాలకులు, వ్యాయామ విద్య అసిస్టెంట్ ప్రొఫెసర్, జాయింట్ రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్, టైపిస్ట్ ఉన్నారు. ఒక్కొక్కరికీ రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు యూనివర్సిటీ నిధులు భరిస్తున్నపుడు అందరి ఆమోదంతో ప్రతినిధులను ఎంపికచేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

అన్ని విభాగాల అభివృద్ధి కోసమే..

జేఎన్‌టీయూకే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతోనే మలేషియా పర్యటనకు 13 మందిని పంపించాము. ఉత్తమమైనది అధ్యయనం చేయడం.. ఏఐ టెక్నాలజీ ఉపయోగించి వ్యవస్థను సమర్థంగా ఎలా నడపాలో నేర్చుకునే అవకాశం దక్కుతుంది. అందుకే గ్రంథాలయం, స్పోర్ట్స్-క్రీడా ప్రతినిధులనూ పంపాము. మరుగుదొడ్ల శుభ్రం చేసే విభాగం హెడ్ సార్జంట్‌ను పాస్‌పోర్టు లేక పంపించలేకపోయాం. విద్యాలయానికి తగిన గుర్తింపు దక్కాలంటే అన్ని విభాగాలూ ముఖ్యమే. -మురళీకృష్ణ, ఇన్‌ఛార్జి వీసీ, జేఎన్‌టీయూకే

నవ్య ప్రణాళికలు.. పారిశ్రామిక వెలుగులు

పెట్టుబడుల ఆకర్షణ.. ఉపాధి అవకాశాలు పెంచేలా కసరత్తు



అపార వనరులకు ఉమ్మడి తూర్పుగోదావరిలో కొదవలేదు. ధాన్యగర్భ ఇది.. సువిశాల సాగర తీరం.. గోదావరి పరివాహకం.. చమురు- సహజ వాయు నిక్షేపాలు.. సారవంత భూములు ఉన్నాయి. ఇక్కడి వనరులు సద్వినియోగం చేసుకుంటే ప్రగతి పరుగులు తీయడం కష్టమేమీ కాదు. పరిశ్రమల ఏర్పాటు, ఉపాధికీ ఆస్కారం ఎక్కువే. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో స్తబ్దత నెలకొంది. కూటమి ప్రభుత్వ రాకతో సానుకూల పరిస్థితి ఏర్పడడం.. నూతన పారిశ్రామిక పాలసీకి కసరత్తు చేస్తుండడంతో ప్రస్తుతం ఉత్సాహ వాతావరణం నెలకొంది.

ఇవీ క్లస్టర్లు.. ఉపాధికి నిచ్చెనలు

◆ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరంలో పప్పుదినుసుల ఉత్పత్తుల క్లస్టర్ నమోదైంది. తాజాగా రూ.10 కోట్ల చొప్పున పెట్టుబడులతో మండపేటలో జ్యూయలరీ, పరుపులు.. మామిడికుదురు, మలికిపురంలో కోకోనట్ విలువ ఆధారిత క్లస్టర్లు, ఆత్రేయపురంలో పూతరేకులు, పచ్చళ్ల క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

◆ తూర్పుగోదావరి జిల్లాలోని రంగంపేటలో పర్నిచర్, రాజానగరం మండలంలో సిరామిక్, గ్రానైట్, ట్రస్ బుల్ (బంగారు నగలు కరిగించే పరికరాలు).. కడియం మండలంలో టెక్స్‌టైల్స్, చాగల్లు ప్రాంతంలో జీడిపిక్కల క్లస్టర్ ఏర్పాటుకు కసరత్తు సాగుతోంది.

◆ కాకినాడ జిల్లా రమణయ్యపేటలో ప్రింటింగ్, గండేపల్లి మండలం సూరంపాలెంలో పాలిమర్స్, కాకినాడ పోర్టు ప్రాంతంలో రైస్ మిల్లింగ్, మరికొన్ని ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లకు ప్రతిపాదించారు.

ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక చిత్రమిదీ..

జిల్లా	భారీ–మధ్య తరహా	ఉపాధి	ఎంఎస్ ఎంఈలు	ఉపాధి
కాకినాడ	62	32,227	13,725	53,027
తూర్పుగోదావరి	38	19,946	31,056	1,00,815
అంబేడ్కర్ కోనసీమ	7	2,360	10,600	21,000

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్

▮▮ కాకినాడ, తూర్పు, కోనసీమ జిల్లాలు వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు.. బియ్యం, పప్పు మిల్లులు, ఎడిబుల్ ఆయిల్, సుగర్, ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, పొటాటో చిప్స్, బిస్కట్లు, బేకరీ వంటి ఉత్పత్తుల పరిశ్రమలకు ఆస్కారం ఉంది. తాండ్ర, నూడిల్స్, పచ్చళ్లు, జీడిపిక్కలు, పౌల్ట్రీ, పశు దాణా పరిశ్రమలూ సరేసరి. సంప్రదాయ వంటకాలు, మిఠాయిల తయారీ రంగాల్లోనూ రాణించే వీలుంది. ▮▮ ఇటుకలు, సిరామిక్ టైల్స్, శానిటరీ సామగ్రి, ఆటోక్లేవ్ ఎయిరేటెడ్ బ్రిక్స్, ఫ్లైయాస్ బిక్స్, రూఫ్ షీట్స్, ప్లాస్టిక్ బేస్డ్ రోడ్డు మెటల్, క్రాఫ్ట్ పేపర్, పాలిథిన్ పౌచ్‌లు, నార సంచులు.. పాఠశాలల/కార్యాలయాల బ్యాగులు, థర్మాకోల్ సంచులు, శానిటరీ నాప్‌కిన్లు, రెడీమేడ్ వస్త్రాల పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం. ▮▮ జనరల్ ఇంజినీరింగ్ వర్క్స్, ఫ్యాబ్రికేషన్, రిగ్‌ల నిర్వహణ, బోట్/షిప్, ఫ్లోటింగ్ వెషల్స్ మరమ్మతుల పరిశ్రమలు ఏర్పాటుచేయొచ్చు.

అవకాశాలు అందిపుచ్చుకుంటే..

భూనిధి అవసరం

పరిశ్రమల ఏర్పాటుకు నిర్దేశించిన భూములను వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీలకు మళ్లించింది. ఎక్కడా భూ బ్యాంకు లేదు. కాకినాడ జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో 95.04 ఎకరాలు మాత్రమే ప్లాట్ల రూపంలో ఖాళీగా ఉంది. ప్రభుత్వం నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. భూములను నియోజకవర్గాల వారీ కేటాయించాలి.

ఔత్సాహికులకు ప్రోత్సాహం..



ప్రభుత్వ నూతన పారిశ్రామిక విధానం త్వరలో అందుబాటులోకి వస్తుంది. పుష్కల వనరులున్న ప్రాంతమిది. ఔత్సాహికులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తుని, జగ్గంపేట, పెద్దాపురం, తొండంగి మండలాల్లో ఏపీఐఐసీ 1,983 ఎకరాలు గుర్తించింది. ప్రతి నియోజకవర్గంలో భూములు కేటాయిస్తే పారిశ్రామిక ప్రగతికి, ఉపాధి అవకాశాలకు ఆస్కారం ఉంటుంది.
- సీహెచ్ గణపతి, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల శాఖ, కాకినాడ

తుపానుతో పలు రైళ్ల రద్దు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): దానా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. దీంతో బుధవారం తూర్పుగోదావరి జిల్లా మీదుగా రాకపోకలు సాగించే 34 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. వీటిలో దూరప్రాంత సర్వీసులు ఎక్కువగా ఉన్నాయి. ఈ నెల 25 వరకు పునరుద్ధరించే పరిస్థితి లేదని చెబుతున్నారు. అప్‌లో 14, డౌన్‌లో 20 రైళ్ల రద్దు కారణంగా ఇక్కడి నుంచి విజయవాడ, సికింద్రాబాద్ వైపు, ఇటు విశాఖపట్నం వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిడదవోలు, రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌తోపాటు కాకినాడ జిల్లా పరిధిలోని తుని, సామర్లకోట రైల్వేస్టేషన్‌లో సహాయ కేంద్రాలు(హెల్ప్‌డెస్క్‌లు) ఏర్పాటు చేశారు. 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

హెల్ప్‌డెస్క్‌ల ఫోన్ నంబర్లు ఇవి..

- రాజమహేంద్రవరం: 0883 2420541
- నిడదవోలు: 0881 3223325
- తుని: 0885 4252172
- సామర్లకోట: 8842327010

లావాదేవీలు అక్రమమా.. సక్రమమా?

16 గంటలపాటు మద్యం డిస్టిలరీల్లో సాగిన సీఐడీ సోదాలు

ఈనాడు, కాకినాడ– న్యూస్‌టుడే, రంగంపేట: వైకాపా ప్రభుత్వంలో అయిదేళ్లు మద్యం డిస్టిలరీలు నిబంధనల మేరకే కార్యకలాపాలు సాగించాయా..? అతిక్రమణలు ఏమైనా ఉన్నాయా..? అనే కోణంలో సీఐడీ అధికారుల నిశిత శోధన సాగుతోంది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామ సమీప బీడీహెచ్ అగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్. రంగంపేట మండలం కోటపాడులో పీఎంకే డిస్టిలేషన్ ప్రై. లిమిటెడ్.. నల్లమిల్లిలోని ప్రాగ్ డిస్టిలరీలో సీఐడీ డీఎస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు మంగళవారం సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన తనిఖీలు అర్ధరాత్రి 1.30 వరకు సాగాయి. 16 గంటల పాటు కీలక దస్త్రాలు పరిశీలించి నివేదికలో నమోదు చేసుకున్నారు. కీలక దస్త్రాలు, కంప్యూటర్లలోని హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుని సీఐడీ కార్యాలయానికి తరలించారు. వీటిలో ఏముందో తెలుసుకునేందుకు పరిశీలన ప్రక్రియ బుధవారం నుంచి చేపట్టారు. గత అయిదేళ్లలో ప్రొక్యూరింగ్ ఆర్డర్ ఎవరి నుంచి ఎంత వచ్చింది..? అబ్కారీ శాఖ కమిషనర్ నుంచి వచ్చిన ఆర్డర్ ప్రకారం మద్యం నిల్వలు సరఫరా చేశారా..? రాజకీయ జోక్యంతోనో, అప్పటి ప్రభుత్వ పెద్దల అనధికారిక ఆజ్ఞలతోనో లెక్కకు మించి మళ్లించారా..? అనేది ఆరా తీస్తున్నారు. ఎన్నికలకు ముందు విచ్చలవిడిగా మద్యం పంపిణీ సాగడంతో.. డిస్టిలరీల్లో ఆయా కాలంలో సాగిన ఉత్పత్తులపైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మరో వారం పది రోజుల్లో ఆయా డిస్టిలరీల్లో లావాదేవీలు అక్రమమా..? సక్రమమా..? అనేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సీఐడీ బృందాలు ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసు సహకారం తీసుకున్నా.. అనుమానాల నివృత్తికే తప్ప.. దస్త్రాల పరిశీలనలో వారి సేవలను వాడుకోలేదు. నివేదికలను త్వరలో ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.



అధికారులతో చర్చిస్తున్న మాజీ మంత్రి యనమల

పోలవరం నిర్వాసితులకు పరిహారం

తుని గ్రామీణం: పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా తొలగించనున్న కుమ్మరిలోవకాలనీ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. తేటగుంట పార్టీ కార్యాలయంలో బుధవారం ఆర్డీవో రమణి, పోలవరం ఈఈ గోవింద్, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ పరిధిలో మరో 115 మంది కుటుంబాలకు రూ.6.10 లక్షలచొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చినట్లు వివరించారు. రాజుపేటలోని జగనన్న లేఔట్ భూముల కేటాయింపులో జరిగిన అక్రమాలపై చర్చించి వాటిపై నివేదిక అందించాలని అధికారులను కోరారు.

విద్యాలయాలకు నిధుల శోభ

జిల్లాకు రూ.3.80 కోట్లు మంజూరు

న్యూస్‌టుడే, కాకినాడ నగరం, సాంబమూర్తినగర్

పాఠశాలల నిర్వహణకు అవసరమైన నిధుల మంజూరుకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత పాలనలో నిలిచిపోయిన నిధులు మంజూరు చేయడంతో ప్రధానోపాధ్యాయుల్లో ఆనందం నెలకొంది. ఒక్కో పాఠశాలకు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.10 వేల నుంచి రూ.లక్షకుపైగా నిర్వహణ నిధులు మంజూరు చేసేవారు. మండల కేంద్రాల్లోని వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) నిర్వహణకు రూ.80 వేల వరకు మంజూరయ్యేవి. వీటితో సుద్దముక్కలు, డస్టర్లు, ఇతర విద్యా సామగ్రిని సమకూర్చుకోవటంతో పాటు చిన్నచిన్న మరమ్మతులకు ఖర్చు చేసేవారు. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలకు సమగ్ర శిక్షా ద్వారా నిధులు మంజూరు చేస్తారు. అంతకుముందు తెదేపా పాలనలో ఇవి సక్రమంగానే మంజూరయ్యాయి.

విద్యార్థుల సంఖ్య	నిధులు (రూ.లలో)
1-30	10,000
31-100	25,000
101-250	50,000
251-1000	75,000
1000 మందికి పైగా	1,00,000

గత పాలనలో నిల్..

వైకాపా హయాంలో గత అయిదేళ్లలో రూపాయి కూడా విదల్చకుండా నిధులు నిలిపివేశారు. కేవలం 2020-21 సంవత్సరంలో 20 శాతం మాత్రమే మంజూరు చేశారు. ఆపై 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ఇవ్వలేదు. దాంతో పాఠశాలల నిర్వహణ భారంగా మారింది. చిన్న పనులు చేయాల్సి వచ్చినా ప్రధానోపాధ్యాయులే సొంత డబ్బు ఖర్చు చేయాల్సివచ్చింది. నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు గత పాలనలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

జిల్లాలో విద్యా సంస్థలు: ఉన్నత పాఠశాలలు 236; మండల వనరుల కేంద్రాలు 21; హైస్కూల్ ప్లస్ 21; ప్రాథమిక బడులు 927; యూపీ పాఠశాలలు 102



కాకినాడలోని పాఠశాల

రూ.1.89 కోట్లు విడుదల

ఇటీవల నిధుల మంజూరు కోరుతూ పాఠశాల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును నేతలు సంప్రదించారు. ఆ మేరకు నిధుల విడుదలపై మంత్రి ఇటీవల స్పష్టత నిచ్చారు. జిల్లాకు రూ.3.80 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.1.89 కోట్లు వెంటనే విడుదల చేస్తున్నట్లు మిగిలినవి త్వరలో ఇస్తామని సమగ్రశిక్ష ఎస్‌పీడీ నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. రెండు, మూడు రోజుల్లో ఇవి సంబంధిత పాఠశాలల యాజమాన్య సంఘాల ఖాతాలకు జమ అవుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొబ్బరి కాయల వేలంలో రికార్డుస్థాయి ధర



అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట ఉద్యాన (కొబ్బరి) పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు ఆధ్వర్యంలో బుధవారం కొబ్బరి కాయల వేలంపాటలు నిర్వహించారు. షరతుల మేరకు 19 మంది పాటదారులు ఒక్కొక్కరూ రూ.10 వేలు చొప్పున డీడీలు తీశారు. అంబాజీపేటకు చెందిన మానే చంద్రశేఖర్ వెయ్యి కొబ్బరికాయలు రూ.19,400 చొప్పున మొత్తం 30 వేల కొబ్బరికాయలను వేలంలో రూ.5,82,000కు దక్కించుకున్నారు. ఇది ఉద్యాన పరిశోధన కేంద్రం చరిత్రలోనే అరుదైన రికార్డుగా రైతులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1955లో అంబాజీపేటలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయగా, ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి కొబ్బరి కాయల వేలం నిర్వహిస్తుంటారు.

పల్లె పండుగకు సాంకేతిక బలగం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ కట్టుదిట్టం చేయనున్నారు. క్షేత్రస్థాయి పనుల్లో నాణ్యత పర్యవేక్షణకు అదనపు సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టారు. పల్లె పండుగ పేరుతో ఈనెల 14 నుంచి 20 వరకు జిల్లాలోని తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పెద్దాపురం, కాకినాడ గ్రామీణం నియోజకవర్గాల్లో ఉపాధి పథకం మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో పెద్ద సంఖ్యలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు పూర్తి చేశారు. రూ.81.22కోట్లతో 857 పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాణ్యతలో రాజీపడకుండా పక్కాగా నిర్మాణాలు చేసేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది.

పర్యవేక్షణకు అదనపు సిబ్బంది..

గ్రామసభల్లో గుర్తించిన ఈ పనులను వెండర్, ఏజెన్సీలకు అప్పగించారు. ఉపాధి హామీ పథకం నిధులతో టెండర్ల ద్వారా పనులు చేపట్టే అవకాశం లేదు. నామినేషన్ పద్ధతిపైనే ఎంపీడీవోల ఆధ్వర్యంలో అగ్రిమెంట్లు చేసి పనులు అప్పగించారు. త్వరలో వీటిని ప్రారంభించనున్నారు. పంచాయతీరాజ్‌శాఖ వద్ద ఉన్న 23 మంది టెక్నికల్ అసిస్టెంట్స్(టీఏ), కంప్యూటర్ ఆపరేటర్లను డ్వామాకు బదలాయించారు. మండలస్థాయిలో డ్వామాకు టీఏలు ఉన్నా ఉపాధి నిధులతో చేపట్టే ఇతర పనులు పర్యవేక్షించాలి. దీంతో పంచాయతీరాజ్‌శాఖ వద్ద ఉన్న టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను సీసీ రోడ్ల నిర్మాణ ప్రక్రియలో వినియోగించుకోనున్నారు. ఈ మేరకు 18 టీఏలు, అయిదుగురు కంప్యూటర్ ఆపరేటర్లను డ్వామాకు బదలాయించి, ధ్రువపత్రాల పరిశీలన చేసి, జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. వీరు ఎంపీడీవోల పర్యవేక్షణలో పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



తుని మండలంలో సీసీ రహదారి నిర్మాణం (పాత చిత్రం)

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.81.22 కోట్లు..

రానున్న రోజుల్లో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో మరిన్ని సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించనున్నారు. 2024-25లో రూ.81.22కోట్లు సీసీ రోడ్ల నిర్మాణానికి కేటాయించారు. రాబోయే నాలుగేళ్లు మరిన్ని నిధులు పల్లెల్లో అభివృద్ధి పనులకు వినియోగించనున్నారు. ఈ నేపథ్యంలో సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. పంచాయతీరాజ్ ఏఈలతో పాటు డ్వామా నుంచి టీఏలను వినియోగించి, పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై డ్వామా జిల్లా ఫైనాన్స్ మేనేజరు విజయ్‌భాస్కర్‌ను న్యూస్‌టుడే సంప్రదించగా... అదనంగా మరో 23 మంది సాంకేతిక సిబ్బంది త్వరలో అందుబాటులోకి వస్తారని చెప్పారు. దీనికి సంబంధించిన ప్రాథమిక ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

ప్రకృతి సౌందర్యం.. కొండకోనల్లో సాక్షాత్కారం



ఎటుచూసినా పచ్చని కొండలు. వాటిపై అందాల కారు మబ్బులు. ప్రత్తిపాడు మండలం ఎరకంపాలెం ఉప ప్రణాళిక మన్యంలోని ఆహ్లాద వాతావరణం ఇది. సముద్రమట్టం నుంచి 1700 మీటర్ల ఎత్తయిన కొండలు, పరవళ్లు తొక్కుతూ ప్రవహించే వాగులు ప్రకృతి సౌందర్యాలకు నెలవు. పర్యాటకులు ఎవరైనా వెళ్తే అక్కడి అందాలకు ముగ్ధులు కావాల్సిందే.
- ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్‌భరత్ తెలిపారు. బుధవారం ఆయన అమరావతి నుంచి మున్సిపల్ కమిషనర్లతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ కె.శైలజ, మెప్మా మిషన్ మేనేజరు డేగల వెంకటరాజు, అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. డ్వాక్రా ఉత్పత్తులతో పాటు వీధి వ్యాపారులు, తయారీదారులందరినీ ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) వేదిక పైకి తెచ్చి, ఉత్పత్తులను ఆన్‌బోర్డింగ్ చేసే ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. మార్కెటింగ్ వ్యూహం, డిమాండ్, ఉత్పత్తి ప్రక్రియలపై శిక్షణ ఇస్తామన్నారు. కిరాణా దుకాణ యజమానులు, మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకంగా ప్రతీ పట్టణ స్థానిక సంస్థలో ఒక నోడల్ అధికారిని నియమిస్తామన్నారు.




హాజరైన మెప్మా అధికారులు, సిబ్బంది

జేఏసీ అమరావతి మహిళా విభాగం సమావేశం నేడు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం సమావేశాన్ని గురువారం సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ ఎదురుగా రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు తెలిపారు. దీనికి మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం పటిష్టత, డివిజన్ కార్యవర్గం కో-ఆప్షన్ ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. మహిళా ఉద్యోగుల సమస్యలపై చర్చించి, కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. జేఏసీ అమరావతి సభ్య సంఘాల ప్రతినిధులు మహిళా ఉద్యోగులను ప్రోత్సహించి, సమావేశాన్ని పంపించాలని ఆయన కోరారు.

రైలొస్తే.. అంతే..


సామర్లకోట రైల్వేస్టేషన్‌లో 2, 3 ప్లాట్‌ఫామ్‌ల మధ్యలో పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

రైలు దిగిన ప్రయాణికులు పట్టాలు దాటడం ప్రమాదకరమని తెలిసినా కొందరు నిర్లక్ష్యం వీడడం లేదు. ఇటు నుంచి అటు కొందరు, అటు నుంచి ఇటు మరికొందరు సామర్లకోట జంక్షన్ రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతున్నారు. స్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫారమ్ నుంచి రెండు, మూడు ప్లాట్‌ఫామ్‌లకు, రెండు, మూడు నుంచి ఒకటో నంబరుకు వెళ్లేందుకు మెట్ల వంతెన ఉన్నా... అది దూరంలో ఉందని భావించి పట్టాలు దాటేందుకే ఆసక్తి చూపుతున్నారు. అలాంటి వారిని నిలువరించి జాగ్రత్తలు సూచించాల్సిన అధికారులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. పట్టాలు దాటుతుండగా రైలొస్తే పరిస్థితి ఏంటనేది ఆలోచించాలి. - న్యూస్‌టుడే, పెద్దాపురం, సామర్లకోట

నాడు నిరుపయోగం.. నేడు ప్రారంభానికి సిద్ధం..


గొల్లప్రోలులో అసంపూర్తిగా నాడు


పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పనులు పూర్తయి ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలో పలు సమస్యలు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో పరిష్కారానికి నోచుకుంటున్నాయి. గొల్లప్రోలు పాపయ్యచావిడి వీధిలోని నంబర్-2 ప్రాథమిక పాఠశాల తరగతి గదుల భవనం 8 నెలలుగా అసంపూర్తిగా నిలిచిపోయి నిరుపయోగంగా ఉన్న తీరును ఇటీవల పర్యటించిన ఉపముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు(పేషీ) గుర్తించారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లా కలెక్టరును ఆదేశించడంతో రూ.1.50 లక్షలు సీఎస్ఆర్ నిధులతో పనులను పూర్తిచేయించారు. ఇది ప్రారంభోత్సవానికి సిద్ధం అవ్వడంతో ఈ విషయాన్ని సీఎంవో 'ఎక్స్' ద్వారా తెలిపింది. అన్ని పనులు పూర్తిచేసి రంగులు వేయడంతో సిద్ధమైన ప్రాథమిక పాఠశాల భవనాన్ని త్వరలో ప్రారంభోత్సవం చేసి తరగతులు ప్రారంభిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

తాగునీటి సమస్య పరిష్కారం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలం కలవలదొడ్డి, వెంకటరాయపురం ప్రాథమిక పాఠశాలల్లో తాగునీటి సదుపాయం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం ఉపముఖ్యమంత్రి పేషీ అధికారుల తనిఖీలో వెలుగులోకి వచ్చింది. దీనిపై పవన్‌కల్యాణ్ స్పందించి రెండు పాఠశాలల్లో వాటర్ ప్యూరిఫైయర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో అధికారులు సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. ఈ విషయాన్ని సీఎంవో 'ఎక్స్' వేదికగా తెలిపింది.


పాఠశాలలో సురక్షిత నీటిని తాగుతున్న విద్యార్థులు

28న ఈపీఎఫ్‌వో 'నిధి ఆప్‌కే నికట్'

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఆయా జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికట్' శిబిరాలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.డి.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జగ్గంపేటలోని ఎస్.ఎస్. విద్యావిహార్ వద్ద నిధిఆప్‌కే నికట్ జరుగుతుందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి తాళ్లరేవు ఫార్మ్స్, కాకినాడ జిల్లాకు సంబంధించి బెండపూడిలో ఎస్.ఎస్.విద్యావిహార్, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఉండి ఎల్ఎస్‌సీఎస్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి వై.రామవరం మండలం యార్లగడ్డ ఏజీ బాలికల ఉన్నత పాఠశాల, గంగవరం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మారేడుమిల్లి మండలంలోని కేజీబీవీ స్కూల్ వద్ద నిధిఆప్‌కే నికట్ శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

ఆలయాల్లో డ్రోన్ సేవలు

- విరివిగా వినియోగంపై ప్రభుత్వం దృష్టి
- అన్నవరం సిబ్బందికి శిక్షణ: ప్రత్యేక సందర్భాలే లక్ష్యం


డ్రోను పనితీరును పరిశీలిస్తున్న అన్నవరం దేవస్థానం అధికారి

న్యూస్‌టుడే, అన్నవరం

డ్రోన్.. ఈ హైటెక్‌యుగంలో ప్రతిచోటా వినిపిస్తోన్న పదం.. కనిపిస్తోన్న పరికరం.. గత కొన్నేళ్లుగా ఈ పరికరం వినియోగం అమాంతం పెరిగిపోవడంతో కూటమి ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. డ్రోన్ సేవలను ఎలా విస్తరించవచ్చు అనే అంశాలపై అవగాహనకు అమరావతిలో రెండ్రోజుల పాటు 'డ్రోన్ సమ్మిట్ - 2024' నిర్వహించి ఆవశ్యకతను వివరించింది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన దేవాలయాల్లో అవసరమైన సమయాల్లో డ్రోన్ల సాంకేతికతను ఎలా సద్వినియోగం చేసుకోవాలి.. భక్తుల రద్దీ సమయాల్లో సేవలందించేందుకు ఎలా వినియోగించుకోవచ్చు అన్న అంశాలపైనా అధ్యయనం చేపట్టింది. అలా కొన్ని దేవాలయాల నుంచి ఉద్యోగులను సమ్మిట్‌కు పిలిపించగా.. అందులో అన్నవరం దేవస్థానం ఉద్యోగులు సైతం పాల్గొన్నారు. అన్ని ఆలయాల నుంచి పది మంది ఇంజనీరింగ్ విభాగ అధికారుల బృందం ఇందులో పాల్గొనగా.. అన్నవరం నుంచి విద్యుత్తు విభాగ డిప్యూటీ ఈఈ వి.సత్యనారాయణ, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ ఎల్.రమేష్, కాకినాడ ఈఈ టి.దుర్గేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొన్ని కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆలయాల్లో ఏఏ సందర్భాల్లో డ్రోన్ వినియోగానికి ఆస్కారం ఉంటుందన్న దానిపై కసరత్తు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

ఆలయాల్లో వినియోగం ఇలా..

- ఆలయాల్లో పండగలు, ప్రత్యేక రోజుల్లో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరుగుతుంది.. ఆ సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకుని తద్వారా శీఘ్ర దర్శనాలు అమలు చేసేందుకు సిబ్బంది చాలా కష్ట పడాల్సి ఉంటుంది.. అదే డ్రోన్ ఉంటే క్యూ లైన్లలో రద్దీ తీరుతెన్నులు విహంగ వీక్షణంలో గుర్తించవచ్చు. ఎక్కడైనా తోపులాటలు, ఇతర అనూహ్య ఘటనలు జరిగినా అంచనా వేయడానికి వీలవుతుంది. క్యూలైన్లను పకడ్బందీగా నిర్వహించడానికి ఉపయోగపడుతుంది.
- దేవస్థానం పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొన్నా.. ఆలయం చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి తెలుసుకోవాలన్నా ఇప్పటివరకు కష్టంగా ఉండేది. ఇకపై ఈ అంశాలనూ డ్రోన్ వినియోగం ద్వారా పక్కాగా మదింపు చేయవచ్చు.
- ఆలయాలకు ఉన్న భూములు చాలా చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. కొన్ని క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నా హద్దులు మారిపోయాయి. వీటిని పక్కాగా లెక్కించడంతో పాటు.. పకడ్బందీగా నమోదు చేయడానికీ డ్రోన్ అవసరం చాలా ఎక్కువ ఉంది.

భద్రతలోనూ కీలకమే..

కేవలం ఆలయ నిర్వహణ పరంగానే కాదు. భద్రత విషయంలోనూ దీన్ని పక్కాగా వినియోగించవచ్చు. అంతర్గతంగా మెటల్ డిటెక్టర్లు, ఇతర పరికరాలతో నిత్య తనిఖీలు జరుగుతూ ఉంటాయి. ఎక్కడికక్కడ భద్రతా సిబ్బంది ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. అయితే, ఉత్సవాలు, పండగలు, ప్రత్యేక సందర్భాల్లో భక్తుల రద్దీ పెరుగుతూ ఉంటుంది. ఆ సమయంలో అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచడానికి ఈ పరికరం పక్కాగా ఉపయోగపడుతుంది. అనూహ్య ఘటనలు జరిగినా వెంటనే గుర్తించి బాధితులకు సాయం అందించవచ్చు. డ్రోన్లలో ఉన్న రకాలను సందర్భాల్ని బట్టి వినియోగించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు సమ్మిట్‌లో అనేక విషయాలు తెలుసుకున్నట్లు చెబుతున్నారు.

శైవ క్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కార్తికమాసం నేపథ్యంలో శైవక్షేత్రాలు, ఆలయాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు సూచించారు. వచ్చే నెల 2 నుంచి కార్తికమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఆలయాలకు చెందిన ఈవోలతో కాకినాడ డీసీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచారామ క్షేత్రాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, స్నానానికి నీటి సదుపాయంతో పాటు, ఉచిత దర్శనాలు తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. సోమవారాలు, ఏకాదశి, పౌర్ణమి వంటి పర్వదినాల్లో రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. స్నానఘట్టాల వద్ద రక్షణ చర్యలతోపాటు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలన్నారు. వేకువజామున 3గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఆలయాలు తెరిచి ఉంచాలన్నారు. ప్రముఖ ఆలయాల్లో గర్భాలయ అభిషేకాలు నిలిపేయాలన్నారు. ప్రత్యేక మండపాలు, ఉత్సవ విగ్రహాలు పెట్టి అభిషేకాలు చేయాలన్నారు. దీపారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 31లోగా పనులు పూర్తి చేయాలన్నారు. కాకినాడ జిల్లా డీఈవో దుర్గాభవానీ, ఉమ్మడి జిల్లాకు చెందిన ఇన్‌స్పెక్టర్లు, ఈవోలు పాల్గొన్నారు.


ఈవోలతో ఏర్పాట్లపై చర్చిస్తున్న డీసీ రమేష్‌బాబు

పేదల వైద్యుడు తేతలి మృతికి సంతాపం

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: పేదల వైద్యుడిగా పేరొందిన డాక్టర్ తేతలి వెంకటేశ్వరరావు(79) మృతికి పలువురు సంతాపం తెలిపారు. కొంతకాలంగా ఉదర సంబంధిత ఇబ్బందితో బాధపడుతున్న ఆయన రాజమహేంద్రవరంలోని దానవాయిపేటలో బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. 1945 ఆగస్టు 29న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జన్మించిన ఆయన కర్నూలు వైద్య కళాశాలలో ఉన్నత విద్య అభ్యసించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్తులో సివిల్ సర్జన్‌గా సేవలు ప్రారంభించి తణుకు, కొయ్యలగూడెం, కాకినాడ ఆసుపత్రుల్లో వైద్యుడిగా పని చేసి పేదలకు సేవలు అందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా.. ఉమ్మడి జిల్లా డీసీహెచ్ఎస్‌గా ఆయన విధులు నిర్వహించారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేసి అనేక మంది వైద్యులను తీర్చిదిద్దారు. గోదావరి జిల్లాల్లో పేరెన్నికగన్న పలువురు వైద్యులు డాక్టర్ తేతలి శిష్యులే. డీసీహెచ్ఎస్‌గా పని చేసినప్పుడు జిల్లాలోని పలు వైద్యశాలల్లో మౌలిక వసతులు, సేవల పెంపునకు విశేష కృషి చేశారు. రాజమహేంద్రవరం వైద్యశాలలో ప్రభుత్వ నిధులు, దాతల సహకారాన్ని కూడగట్టి పలు సౌకర్యాలు కల్పించారు. ప్రభుత్వ సేవల నుంచి రిటైరైనా నగరంలో ఓ క్లినిక్‌ను ఏర్పాటు చేసి ఉచిత వైద్యసేవలందించేవారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

ఎండిపోయిన 'అందాలు'



నగర సుందరీకరణలో భాగంగా పచ్చదనానికి పెద్దపీట వేస్తూ మొక్కలు నాటారు. అంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాత నిర్వహణ లేకపోవడంతో కళావిహీనంగా మారుతున్నాయి. సమయంతో పాటు రూ.లక్షలు వృథా అవుతున్నాయి. గత ప్రభుత్వ కాలంలో ఎన్నికలకు కొన్ని నెలల ముందే ఫాక్స్‌టైల్ ఫామ్ చెట్లు నాటారు. కాకినాడలోని ఇంద్రపాలెం కూడలి నుంచి ప్రతాప్ నగర్ బ్రిడ్జి వరకు సామర్లకోట రహదారి విభాగినుల్లో నాటిన ఈ చెట్లు నిర్వహణ లేక మోడుబారాయి. - ఈనాడు, కాకినాడ

కోతి చేష్టలకు కరెంటు వల

పిల్లలు విపరీతమైన అల్లరి చేస్తే కోతి చేష్టలు ఆపమని పెద్దలు మందలిస్తుంటారు. ఈ కోతి చేష్టలు మెట్ట ప్రాంత రైతులకు తలకాయ నొప్పులు తెస్తున్నాయి. జగ్గంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని పొలాల్లోకి వస్తున్నాయి. పంటలను పాడుచేస్తున్నాయి. వీటి నుంచి సాగును కాపాడుకోడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. కొంతమంది విద్యుత్తు కంచె, మరికొంతమంది వలలను రక్షణగా ఏర్పాటు చేస్తున్నారు. స్థోమత లేని రైతులు పెద్దగా శబ్దాలు చేస్తూ కోతులను తరుముతున్నారు. ఆ చిత్రాలే ఇవి. - ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం


పొలంలో కోతుల సంచారం


సీతారామపురం వద్ద ఓ పొలానికి వేసిన విద్యుత్తు కంచె


రాజపూడి వద్ద పొలాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేసిన వల

29న ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా జట్ల ఎంపికలు

మసీదుసెంటర్(కాకినాడ): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు కాకినాడ డీఎస్ఏ డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ బుధవారం తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమేనన్నారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి కాకినాడ డీఎస్ఏ మైదానంలో పోటీలు జరుగుతాయన్నారు. ఆధార్‌కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరుకావాలన్నారు. అభ్యర్థులకు టీఏ, డీఏలు ఉండవన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 28 మధ్యాహ్నం ఒంటిగంటలోగా స్వయంగా లేదా dsakakinada2023@gmail.com ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

పశుగణాంక అధికారి దుర్మరణం: ఇద్దరికి గాయాలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: లారీడ్రైవర్ నిద్రమత్తు ఓ నిండుప్రాణాన్ని బలితీసుకుంది. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలపాలవడానికి కారణమైంది. కాకినాడ జిల్లా తుని మండలం జగన్నాథగిరి కూడలిలో వి.కొత్తూరు వెళ్లే రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పశుగణాంక అధికారి దుర్మరణం చెందగా ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు కారులో పైల వెంకటసత్య అప్పలస్వామినాయుడు (60), మరో ముగ్గురు వ్యక్తులు వెళ్తూ మార్గంమధ్యలోని తుని మండలం జగన్నాథగిరి కూడలి సమీపంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన కాసేపు వాహనాన్ని ఆపారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొనడంతో కారు ముందున్న అప్పలస్వామినాయుడు అక్కడికక్కడే మృతిచెందగా గోవిందరాజు, తారక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంట పంచాయతీలో పశుగణాంక అధికారిగా పనిచేస్తున్నారని ఎస్సై కృష్ణామాచారి తెలిపారు. ఈయన విశాఖపట్నానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న జాతీయ రహదారుల అధీకృత సంస్థ అంబులెన్సు సిబ్బంది బాధితులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.


అప్పలస్వామి నాయుడు

ముగిసిన ఖోఖో క్రీడాకారుల శిక్షణ

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఖోఖో క్రీడాకారుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. పురపాలక సంఘ వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజేస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఖోఖో శిక్షణ నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 18 మంది క్రీడాకారులు ఈ నెల 25న కాణిపాకంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నమెంటుకు ఎంపిక అయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడా దుస్తుల కిట్లును అందించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఖోఖో కార్యదర్శి పట్టాభి, కౌన్సిలర్ పాలిక కుసుమ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, శిబిరం నిర్వహకుడు జాన్ కెనడి, నాయకులు చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ పొందిన క్రీడాకారులతో కౌన్సిలర్ కుసుమ, ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	11,500
పాతకాయ: గండేరా	16,000
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	15,500
గటగట	13,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	12,000-13,500
కొత్త (పచ్చి) కాయ	11,500-12,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

నర్సుల అసోసియేషన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షురాలిగా బూరిగ విజయలక్ష్మి(110 ఓట్లు) విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి టి.నందన తెలిపారు. అసోసియేషన్ ఎన్నికలు కాకినాడ జీజీహెచ్‌లో బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. పోలీసు బందోబస్తు మధ్య అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 243 మంది ఓటర్లు ఉండగా 213 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు నందన తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి(126 ఓట్లు), కార్యదర్శిగా గట్టు ప్రమోద(104 ఓట్లు), కోశాధికారిగా కాకి వెంకట పరమేశ్వరి(137 ఓట్లు) గెలుపొందారన్నారు. సభ్యులుగా వి.ఇందిరా, కె.దేవి, జి.వీరలక్ష్మి, బి.అక్కమ్మ, ఎం.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. విజయం సాధించిన ప్యానల్ సభ్యులను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీజీవో సంఘ కార్యవర్గ సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. ఉమ్మడి జిల్లా ఏపీఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామామోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ల చంద్రరావు, కాకినాడ యూనిట్ అధ్యక్షుడు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో ఏపీఎన్‌జీజీవో సంఘ నాయకులు

కాకినాడ

రైతుబజార్లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా - 38, వంకాయలు - 50.68, బెండకాయలు - 46, పచ్చిమిర్చి - 48, కాకరకాయ - 36, బీర - 45, కాలీఫ్లవర్ - 15.20, క్యాబేజీ - 44, క్యారెట్ - 44, దొండకాయలు - 30, బంగాళాదుంపలు - 30.36, ఉల్లి - 45.50, గోరుచిక్కుళ్లు - 38, దోసకాయలు - 40, ఆనపకాయ - 30.35, పొట్లకాయ - 20.25, అరటికాయ - 5.6, చిక్కుళ్లు - 100, చేమదుంపలు - 30.44, మునగకాడలు - 5.6, బీట్‌రూట్ - 40, కీరదోస - 26, బీన్స్‌గింజలు - 130, అల్లం - 60, క్యాప్సికం - 100, బొబ్బర్లు - 52, చిలకడదుంపలు - 32, నిమ్మకాయలు(డజన్) - 24.48.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4ప్లెక్స్- దేవర, వెట్టయాన్ ది హంటర్, విశ్వం, ఇద్దరు, జనక అయితే గనక, సత్యం సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4ప్లెక్స్- డిడీల్, విశ్వం, జిగ్రా, లక్కీ- ఇద్దరు, సత్యగౌరి- లవ్‌రెడ్డి, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సినిమాస్ 1- జనక అయితే గనక, సినిమాస్ 2- శ్వాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి)- దేవర పార్ట్ 1, సూర్య 2- వెట్టయాన్ ది హంటర్ (మ,రా)విశ్వం(ఉ,సా), శ్రీకృష్ణనివాస్(పేరంగి)- సలార్(మ,సా), ఈశ్వర్(ఉ,సా).



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల్లో స్వీయ క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. అన్నవరం సత్యదేవ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజియేట్ తైక్వాండో పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కళాశాల పీడీ, కౌన్సిలర్ జి.ప్రమీలా రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో తైక్వాండో క్రీడాకారులకు క్రీడా కోటా ఉండేది కాదని, క్రీడాకారుల కోరిక మేరకు ఈ క్రీడను చేర్చడంతో పాటు ఉద్యోగాలు సైతం కేటాయిస్తున్నారన్నారు. సుమారు రూ.66 కోట్లతో జగన్నాథపురంలో నూతనంగా స్టేడియం నిర్మిస్తున్నారన్నారు. ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఎం.సుబ్బారావు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ అబ్జర్వర్ రవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వసంతలక్ష్మి, కోచ్ లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు చెల్లు.. ఆదాయం ఫుల్

రూ.20 కోట్లతో బయో ప్లాంట్..

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

కాకినాడ నగరపాలక సంస్థ పర్యావరణ హితంగా అడుగులేస్తోంది. కాలుష్య నివారణకు సంకల్పించింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణకు శాస్త్రీయతను జోడిస్తోంది. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ డంపింగ్‌యార్డు రహిత నగరం దిశగా చర్యలు చేపడుతున్నారు. నగరంలో రోజూ ఉత్పత్తి అవుతున్న చెత్తలో 50 శాతం ప్రాసెసింగ్ చేయడం ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చేలా కార్యాచరణ రూపొందించారు. గత వైకాపా హయాంలో తాళ్లరేవు మండలం, చొల్లంగిలో ఈ ప్లాంటు ఏర్పాటుకు సంకల్పించారు. అప్పటి ప్రజాప్రతినిధుల సహకారం లేకపోవడంతో అటకెక్కింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరానికి సమీపంలోనే ప్లాంటు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.



ప్లాంటు ఏర్పాటు చేసే స్థలంలో చదును పనులు

పనులకు శంకుస్థాపన నేడు..

బయోమెథనేషన్ ప్లాంటు నిర్మాణ పనులకు గురువారం సాయంత్రం 5 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. మున్సిపల్ కమిషనర్ భావన ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నారు. ఈ ప్లాంటు సాకారం ద్వారా నగరానికి ఎంతో మేలు జరుగుతుందని కమిషనర్ భావన తెలిపారు. ఇప్పుడు తడి చెత్త ప్రాసెసింగ్‌కు ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో పొడి చెత్తకు మరో ప్లాంటు రానుందన్నారు. సమర్థ ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా నగరాన్ని పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతామన్నారు.

పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్(పీపీపీ) విధానంలో బయో మెథనేషన్ ప్లాంటు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఎవర్‌నెట్ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారు. రూ.20కోట్లతో దీన్ని తొమ్మిది నెలల కాలంలో నెలకొల్పేందుకు నగరపాలక సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ మొత్తం వ్యయాన్ని ప్రైవేటు సంస్థ భరించనుంది. దీనికి స్థానిక దుమ్ములపేట, డ్రైనేజీలు దాటిన తర్వాత నగరపాలక సంస్థకు చెందిన రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. తడి చెత్తను 20 ఏళ్ల పాటు ప్రాసెసింగ్ చేసే సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారు. రోజూ నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో 89 మెట్రిక్ టన్నుల తడి చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 40 మెట్రిక్ టన్నులు ఈ ప్లాంటుకు సరఫరా చేయనున్నారు.

పర్యావరణ హితంగా పరిష్కారం..

దీని ద్వారా కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు. దీన్ని సదరు సంస్థ వినియోగించుకోనుంది. ప్లాంటుకు తడి చెత్త సరఫరా చేసినందుకు కార్పొరేషన్‌కు ఈ సంస్థ నెలకు రూ.లక్ష చెల్లిస్తుంది. ఇటు చెత్త సమస్యకు పరిష్కారంతో పాటు ఆదాయ వనరులు సమకూరనున్నాయి.

రేపు విద్యుత్తుకు అంతరాయం

కాకినాడ కలెక్టరేట్: పోర్టు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం వార్షిక మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంజయ్‌నగర్, పర్లోపేట, రాజీవ్‌గృహకల్ప, వార్ఫురోడ్డు, బుడంపేట, సూర్యనారాయణపురం, తిలక్‌వీధి, దుమ్ములపేట, యుడు వీధి, పాత పోర్టు రైల్వేస్టేషన్, ఏటిమొగ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

34 మందికి జైలు, జరిమానా

మసీదు సెంటర్: రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే ఉద్దేశంతో నగర ట్రాఫిక్-1,2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 34 మందిని పట్టుకున్నట్లు సీఐ ఎన్.రమేష్ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన 34 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా 19 మందికి రెండు రోజుల జైలు, 15మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు. ఈ మేరకు కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు బుధవారం తీర్పు చెప్పారన్నారు.

నాణ్యమైన విద్యతోనే దేశాభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

గాంధీనగర్, న్యూస్‌టుడే: నాణ్యమైన విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం కచేరిపేటలోని యూటీఎఫ్ హాల్‌లో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యారంగం- సవాళ్లు అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యవక్తగా బాలసుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో ఉత్పత్తిలో భాగస్వాములయ్యే వారికి తప్పనిసరిగా విద్యను అందిస్తారని, మనదేశంలో చదువు కొందరికే పరిమితం చేశారన్నారు. కేరళ, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీలో ప్రభుత్వ విద్యారంగం బలంగా ఉందన్నారు. మనదేశంలో, రాష్ట్రంలో పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు చాలా ప్రయాస పడుతున్నారన్నారు. తల్లిదండ్రులకు భారం కాకుండా నాణ్యమైన విద్య అందరికీ అందాలనే డిమాండ్ పౌర సమాజం నుంచి రావాలని, తద్వారా పాలకుల విధానాలు మార్చాలన్నారు. పెన్షనర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ, జవివే జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు, స్టడీ సర్కిల్ వ్యవస్థాపక కన్వీనర్ సిహెచ్‌వి.రమణ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సృజనకు పదును

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: ప్రతిభకు మెరుగులు దిద్దేలా 'ఈనాడు' నిర్వహిస్తున్న పోటీలతో సృజనాత్మకత పెరుగుతుందని కాకినాడ నారాయణ పాఠశాలల ఏజీఎం కె.రాఘవేంద్రరావు అన్నారు. నగరంలో రామారావుపేట నారాయణ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన పోటీలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో ఉండపల్లి సంజన(10వ తరగతి) ప్రథమ బహుమతి, నెర్ల మోహన ప్రియ(8వ తరగతి) ద్వితీయ బహుమతి, కాండ్రేగుల తేజశ్రీ అక్షయ్(9వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ఏజీఎం రాఘవేంద్రరావు, పాఠశాల కోఆర్డినేటర్ సుంకర మూర్తి, ప్రిన్సిపల్ షర్మిల, అకడమిక్ డీన్ రమణారావు చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఉపాధ్యాయులు కాంచన, రేష్మి, మణిరత్నం, సతీష్‌లు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో విద్యార్థులు



విజేతలతో నారాయణ పాఠశాల ఏజీఎం రాఘవేంద్రరావు తదితరులు

'క'తో ఆహ్లాదం.. వినోదం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చిత్ర హీరో కిరణ్ అబ్బవరం

గాంధీనగర్, న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'క' చిత్రం ఉంటుందని చిత్ర హీరో కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా కాకినాడకు వచ్చిన ఆయన రామారావుపేటలోని హోటల్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పేరు చూసి ఇదేంటి అనుకుంటారని, మొత్తం చూసిన తర్వాత ముగింపులో దానికి సమాధానం దొరుకుతుందన్నారు. తెలుగుతో పాటు, వివిధ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తున్నామన్నారు. కేఏ ప్రొడక్షన్ బ్యానర్‌పై సినిమాను రచయిత, దర్శకుడు సుజీత్, సందీప్‌లు తెరకెక్కించారన్నారు. తెలుగు యాక్షన్ థ్రిల్లర్ అయిన ఈ సినిమా 31న దీపావళి సందర్భంగా విడుదల అవుతోందన్నారు. అభిమానులు ఆయనతో స్వీయచిత్రాలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

ఈఎస్‌ఐ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: ప్రతి కార్మికుడు ఈఎస్‌ఐ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్‌ఐ వైద్యులు డా.అన్వేష్‌కుమార్ సూచించారు. బాలాజీచెరువు కూడలి వద్ద లలితా జ్యువెలరీ షోరూంలో కార్మిక రాజ్య బీమా సంస్థ ఈఎస్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి బీపీ, షుగర్, ఈసీజీ స్కానింగ్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డా.అన్వేష్ కుమార్ మాట్లాడుతూ ఈఎస్‌ఐ ఆసుపత్రిలో అన్నిరకాల వైద్య పరీక్షలతో పాటు, శస్త్ర చికిత్సలూ చేస్తామన్నారు. వైద్యులు శ్రీదేవి, మానసతోపాటు లలితా జ్యువెలరీ మేనేజర్లు సంతోష్, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి హుండీల నగదు లెక్కింపు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలో ప్రముఖ ఆలయంగా పేరుగాంచిన జగన్నాథపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను బుధవారం కాకినాడ డివిజన్ తనిఖీదారు ఫణికుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయ ఈవో ఎస్.సత్యవాణి ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమం జరిగింది. మూడు నెలల పది రోజులకు రూ.10,87,090 ఆదాయం సమకూరినట్లు ఈవో సత్యవాణి తెలిపారు.

పట్టు తప్పితే.. బతుకు బోల్తా



నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకర ప్రయాణాలు వద్దని ఎంత చెబుతున్నా కొంత మంది లెక్కచేయట్లేదు. నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన డీమార్టు కూడలిలో ఓ ఆటోలో మహిళలు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. ముందు భాగంలో డ్రైవర్ సీటుకు రెండువైపులాతో పాటు వెనుక భాగంలోనూ ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణిస్తున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

ఎస్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



మొక్క నాటుతున్న పోర్టు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని కాకినాడ పోర్టులో బుధవారం నిర్వహించారు. ఎస్‌పీఎఫ్ డీజీ త్రివిక్రమ వర్మ, ఐజీ బీవీ రామిరెడ్డి ఆదేశాల మేరకు కమాండెంట్ కేఎన్ రావు, అసిస్టెంట్ కమాండెంట్ బి.శ్రీనివాస్ సూచనలతో రైజింగ్‌డే ఉత్సవాలు నిర్వహించినట్లు పోర్టు ఇన్‌స్పెక్టర్ జి.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా యాంకరేజ్ పోర్టులో మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ కాకినాడ యాంకరేజ్ పోర్టు, అన్నవరం, ఓఎన్జీసీ వంటి ప్రముఖ ప్రదేశాల్లో సుమారు 260 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం 'బడా ఖాన' నిర్వహించి క్రీడల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్సై కృష్ణారావు, ఏఎస్సైలు సాంతేశ్వరరావు, సుబ్బారాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

న్యాయం చేయాలని క్రీడాకారుల వినతి

మసీదుసెంటర్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ తైక్వాండో ఎంపికలు బుధవారం కాకినాడలో జరిగాయి. వివిధ కేటగిరీల్లో జరిగిన ఈ ఎంపికల్లో బంగారు పతకాలు సాధించిన తమను తీసుకోలేదని పలువురు క్రీడాకారులు ఆరోపించారు. భార్గవి, హర్షవర్ధన్, హరికిరణ్ మాట్లాడుతూ తమకు బంగారు పతకాలు వచ్చినా ఎంపిక చేయలేదన్నారు. సెలక్షన్ కమిటీని అడిగితే తాము మెరుగైన ప్రదర్శన కనబర్చలేదని, అందుకే తీసుకోలేదన్నారన్నారు. అదే నిజమైతే తమకు బంగారు పతకాలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వారికి కావాల్సిన వాళ్లను ఎంపిక చేసేందుకు తమను తొలగించారని ఆరోపించారు. తైక్వాండో అసోసియేషన్‌కు సంబంధం లేని వ్యక్తిని అబ్జర్వర్‌గా పెట్టారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

వృథా అరికట్టరూ..



మసీదు సెంటర్: నగరంలోని గొడారిగుంట ప్రధాన రహదారిపై పైపులైను పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పోతుంది. కొన్ని రోజులుగా ఈ పరిస్థితి నెలకొనడంతో మురుగు చేరి, సమస్య నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల వలయంలో సాంకేతిక విద్యాలయం



యూసీఈకే ప్రిన్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో నిలిచిన వర్షపు నీరు

సాంకేతిక విద్యకు ఆలవాలమై, ఆవిష్కరణలకు వేదికైన జేఎన్‌టీయూకేలో ముంపు సమస్య వెంటాడుతోంది. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో రూ.కోట్లు ఖర్చు చేసి సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నారు. నెలలు గడుస్తున్నా అవి కొలిక్కి రావట్లేదు. వీటిని ఎత్తుగా నిర్మిస్తుండటంతో ప్రాంగణమంతా పల్లంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు ప్రదేశాలు చెరువులను తలపిస్తున్నాయి. నీరు పారేందుకు అవకాశం లేకపోవడంతో రోజులు గడుస్తున్నా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దుర్వాసన, దోమలకు నిలయంగా మారింది. తప్పనిసరి పరిస్థితుల్లో మోటార్లతో నీటిని తోడుతున్నారు. ఎక్కడైనా ముంపు ప్రాంతం ఉన్నా, కాలువలు, వంతెనలు, మురుగు కాలువలు నిర్మించాలన్నా ఇంజినీర్ల సాయం తీసుకుంటారు. అటువంటిది దేశానికి భావి ఇంజినీర్లను అందించే విశ్వవిద్యాలయంలో ఇలాంటి పరిస్థితి నెలకొనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్



ముంపు నీటిని మోటార్ల సాయంతో తోడుతున్న దృశ్యం

ఆర్థికసాయం పంపిణీ

మసీదు సెంటర్: హిందూపురంలో అండర్-14 ఫుట్‌బాల్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అండర్-14, 17 జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి ఆర్థికసాయం అందజేశారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారుల జట్లకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.19,600ను కోచ్ జీపీఆర్ఎస్ కౌర్‌కు బుధవారం కాకినాడలో ఇచ్చారు. వీటితో పాటు క్రీడాసామగ్రిని కూడా ఇచ్చారు. ఎస్‌జీఎఫ్ జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ జి.సునీల్‌కుమార్, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అభ్యంతరాలున్నచోట దుకాణాలొద్దు

కాకినాడ కలెక్టరేట్, గాంధీనగర్: ప్రజలు అభ్యంతరాలు తెలిపినచోట మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దని సీపీఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం నాయకులు పలివెల వీరబాబు, దువ్వ శేషబాబ్జీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో 36 మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చారని, వీటిని జనావాసాలకు దూరంగా, గుడి, బడి, జాతీయ నాయకుల విగ్రహాలున్న చోట ఏర్పాటు చేయొద్దని కోరారు. కచేరిపేటలోని యూటీఎఫ్ హోం వద్ద మద్యం దుకాణం వద్దని ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. దుకాణాల చెంతనే మద్యం సేవిస్తున్నారని, ట్రాఫిక్, ఇతర సమస్యలు వస్తున్నాయన్నారు. అన్నమ్మఘాటీ కూడలిలో మున్సిపల్ ఉన్నత పాఠశాలకు సమీపం, గాంధీనగర్‌లోని గాంధీజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దుకాణాలను తరలించాలన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్: జనావాసాల మధ్య మద్యం దుకాణాన్ని తొలగించాలని పలువురు ఆందోళన చేశారు. డైరీఫారం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన నంబరు-4 విజయ వైన్స్ దుకాణాన్ని ఎత్తివేయాలని మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయిస్ కాలనీ వాసులు బుధవారం నిరసన తెలిపారు. రెవెన్యూ కాలనీ నుంచి ర్యాలీగా డెరీఫారం సెంటర్‌కు వచ్చి నినాదాలు చేశారు. రాత్రిపూట మహిళల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని వాపోయారు. గతంలో ఇదే ప్రాంతంలోని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తొలగించాలని ఫిర్యాదు చేశామని, మళ్లీ అదే ప్రాంతంలో ప్రైవేటు దుకాణం పెట్టారన్నారు. నగర ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని కోరారు. ఏడిద కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జిలాని, అలీషా, రమణ, రంగారావు, రఫీ, రోజా, రమణి, మేరీ, ఆస్టిన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో సేవా కార్యక్రమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: శుభకార్యాలకు రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ సంకల్ప్ చార్టర్ ప్రెసిడెంట్ సామా రాజేశ్వరి భర్త సామా రమేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైడీ. రామారావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్, లయన్స్ పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ హాజరయ్యారు. వేడుకలకు రక్తదానం చేయడాన్ని అలవాటుగా మార్చాలన్నారు. ఇప్పటివరకు లయన్స్ డిస్ట్రిక్ట్‌లో 500 యూనిట్ల రక్తం సేకరించామన్నారు. ఎస్.లక్ష్మీప్రసన్న, ఎస్.లక్ష్మీలావణ్య, ఎం.విశ్వేశ్వరరావు, సూర్యారావు, చిట్నీడి శ్రీనివాసు, రమణమూర్తి, మాలతి, డాక్టర్ సువర్చల, మెట్ట రాధ, సుజాత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో దాతలు రెడ్‌క్రాస్ ఛైర్మన్, తదితరులు

ఆకతాయిలకు అడ్డాగా..



తాగి పడవేసిన మద్యం సీసాలు

కాకినాడ నగరం జగన్నాథపురం చర్చి స్క్వేర్ ప్రాంతంలోని నగరపాలక ఉద్యానం అధ్వానంగా దర్శనమిస్తోంది. ఈ ప్రాంతంలో ఉద్యోగులు, చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలు అధికంగా నివాసం ఉంటున్నారు. సాయంత్రం వేళలో కాస్త సేదతీరడానికి ఉద్యానంలోకి అడుగు పెడితే అందులో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. చాలాకాలం నుంచి సరైన నిర్వహణ లేకపోవడంతో ఈ ఉద్యానం కళావిహీనంగా తయారైంది. నడక దారిలో వ్యర్థాలు పేరుకుపోవడంతో నడక సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల సంచారం ఎక్కువగా ఉండటంతో సందర్శకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానం ఆకతాయిలకు, మందుబాబులకు అడ్డాగా మారింది. చీకటి పడితే అందులోకి వెళ్లి మద్యం తాగుతున్నారు. మద్యం సీసాలను, వాటర్ ప్యాకెట్లను అక్కడే పడవేస్తున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్



నడక దారిలో పడేసిన పరికరాలు

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం



అయ్యప్పస్వామికి అభిషేకాలు, పూజలు

గొల్లప్రోలు, కొత్తపల్లి, న్యూస్‌టుడే: దుర్గాడ శివాలయంలో అయ్యప్పస్వామికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రుద్రాక్షమాలలతో అయ్యప్పస్వామిని అలంకరించి కుంకుమపూజలు చేశారు. అనంతరం హారతులిచ్చారు. ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. ● కొత్తపల్లి ప్రధాన సెంటర్‌లో ఉన్న శ్రీధర్మశాస్తా ఆలయంలో అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్పమాలధారులు భారీగా పాల్గొని భజనలు చేశారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

కాజులూరు, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ అవార్డులు అందుకున్న ప్రధానోపాధ్యాయుడు పంపన కృష్ణమూర్తి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తులను బుధవారం సత్కరించారు. కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో జె.శామ్యూల్ బెన్‌హర్ అధ్యక్షతన పాఠశాల కమిటీ, ఉపాధ్యాయ బృందం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు జె.డేవిడ్, పి.జాన్, పాఠశాల కమిటీ ఛైర్మన్ పి.వర్ధరాజు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సాయినాథుని నవరాత్రి ఉత్సవం


సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామోత్సవం

కరప: సాయి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కరపలో బుధవారం ముగింపు వేడుకలు వైభవంగా జరిపారు. కరపలో గంటాలమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన షిర్డీసాయి మందిరంలో గత తొమ్మిది రోజుల నుంచి స్వామి వారికి ప్రత్యేక హోమాలు, కాగడ హారతి, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, సామూహిక సత్యసాయి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పల్లకిలో ఉంచి కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ గ్రామోత్సవం చేశారు.

సిమెంటు రోడ్డు నిర్మాణం ప్రారంభం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. గతనెలలో ఉపముఖ్య మంత్రి కార్యాలయ అధికారులు గొల్లప్రోలులో పర్యటించిన సందర్భంగా పీహెచ్‌సీ మార్గం బురదమయంగామారిన సమస్యను వారి దృష్టికి తెచ్చారు. దీంతో పవన్‌కల్యాణ్ ఆదేశాలపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి మండల పరిషత్ నిధుల నుంచి రూ.4 లక్షలు నిర్మాణం కోసం కేటాయించి పనులు ప్రారంభించారు.

చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

పెదపూడి, న్యూస్‌టుడే: గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఈవోపీఆర్డీ ఎ.సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దాడలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువును తయారు చేయాలన్నారు. కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, డీఈఆర్‌సీ టీం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమం

గొల్లప్రోలు: పాఠశాలల్లో రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనీమియా ముక్త్ భారత్ దిశగా పాఠశాల విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనతను గుర్తించడం ద్వారా కౌమారదశ బాలికలకు పౌష్టికాహారం గురించి వైద్య సిబ్బంది వివరించారు. విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీచేస్తున్నట్లు గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్బారావు తెలిపారు. వన్నెపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం వి.రాజేంద్రప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయిని వి.సూరకాంతకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు అప్పారావు, రజనీ, రత్నకుమారి, శృతి, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు నిర్మించాలని నిరసన

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: వాకలపూడి ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద కాలనీవాసులు నిరసన చేపట్టారు. కాలనీలో చేపడుతున్న నీటి ట్యాంకు నిర్మాణాన్ని కొందరు అడ్డుకుంటూ అడ్డు తగులుతూ వేరే చోటుకు తరలించాలని రాజకీయం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, అధికారులు స్పందించి ట్యాంకు నిర్మాణం వెంటనే చేపట్టి తాగునీటి అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

రీసర్వే లోపాల సవరణకే గ్రామసభలు

కరప: రీసర్వేలో లోపాల సవరణకే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని తహసీల్దారు సత్యనారాయణ అన్నారు. కరపమండలం జి.భావారంలో బుధవారం ఆయన గ్రామసభ నిర్వహించి అర్జీలను స్వీకరించారు. భూములకు సంబంధించిన విస్తీర్ణంలో వ్యత్యాసం, పేర్లు తప్పులు తదితర అభ్యంతరాలను గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. రీసర్వే డీటీ దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ రూపవతి పాల్గొన్నారు.

సామర్లకోట గ్రామీణం: మండలంలోని ఉండూరు శివారు వల్లూరు రెవెన్యూ గ్రామ పరిధిలో బుధవారం రీసర్వే గ్రామసభ తహసీల్దార్ కె.చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. రీసర్వేలో భూమి విస్తీర్ణం తగ్గిందని 10, సర్వే నంబరు సరిచేయమని 4, ఇతర దరఖాస్తులు కలిపి మొత్తం 28 అందినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్, మండల సర్వేయర్ సీతారామచార్యులు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

భూ సమస్యలపై 21 వినతులు

తాళ్లరేవు: రీ సర్వేలో వచ్చిన సమస్యలపై బుధవారం చొల్లంగి సచివాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు పితాని త్రినాథ్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. భూమి సమస్యలపై 21 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. తెదేపా మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ గంగిసూర్యనారాయణ, బూరెల వెంకటరాజు, గర్రే లక్ష్మీనారాయణ, వీఆర్వో కట్టా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

కాజులూరు: పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువలేనివని బందనపూడి సర్పంచి దేగల తిరుమలదేవి అన్నారు. బుధవారం గొల్లపాలెంలో పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా సమతా విద్యాసంస్థల విద్యార్థులతో కాజులూరు సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశరక్షణ, గ్రామ రక్షణలో పోలీస్ త్యాగాలు మరువలేనివని అన్నారు. ఈ ర్యాలీలో ఎస్సై మోహన్‌కుమార్, పెంకే శివాజీ, పి.బులిరాజు, స్టేషన్ సిబ్బంది, పలు విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పేదల ఇంటి బిల్లులకు మోక్షం

ఎన్టీఆర్ గృహ కల్ప పథకం లబ్ధిదారులకు ఊరట

పెదపూడి, న్యూస్‌టుడే: గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ గృహ కల్ప పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో పెండింగ్ బిల్లులు జమ కానున్నాయని అధికారులు వెల్లడించడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిలిపివేసింది. దీంతో అయిదేళ్ల పాటు గృహనిర్మాణ శాఖ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరిగినా ఫలితం దక్కలేదు. కూటమి ప్రభుత్వం రాకతో వీరి ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఇటీవల సంబంధిత అధికారులు బృందం సర్వే పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి పంపించారు.

4,440 ఇళ్లకు..

గత తెదేపా ప్రభుత్వ హయాంలో పెదపూడి, కరప, కాకినాడ గ్రామీణం మండలాల్లో నివేశన స్థలాలు ఉన్న వారికి పక్కా గృహాలు మంజూరు చేశారు. వారిలో 4,440 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 505 మంది ఇళ్లు పూర్తిచేయగా.. 3,935 మంది ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వాటికి గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. ప్రస్తుత ప్రభుత్వం సర్వే చేయించింది. ఆ వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు గృహనిర్మాణ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

మూడు మండలాల వివరాలు..

మండలం	మంజూరైనవి	పూర్తి	వివిధ దశల్లో
పెదపూడి	986	203	783
కరప	1648	57	1591
కాకినాడ గ్రామీణ	1806	245	1561


సర్వే నిర్వహిస్తున్న గృహనిర్మాణ శాఖ అధికారులు

సర్వే పూర్తి చేశాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు పెదపూడి మండలంలోని పూర్తిస్థాయిలో ఎన్టీఆర్ గృహకల్ప పథకం కింద వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు, లబ్ధిదారుల వివరాలను సర్వే చేసి సేకరించాం. నివేదికను ఉన్నతాధికారులకు పంపాం. త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమ అయ్యే అవకాశం ఉంది.

- శ్రీనివాసరావు, గృహనిర్మాణ శాఖ ఏఈ, పెదపూడి

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రాకుండా చర్యలు

కరప: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని ఏవో వెంకటరాజేష్ అన్నారు. కరపలో బుధవారం ఆయన తహసీల్దారు సత్యనారాయణతో కలిసి మండల పరిధిలోని రైతుసేవా కేంద్రాలలోని సిబ్బందికి కొనుగోలు ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొనుగోలు ప్రక్రియలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు, తేమ నిర్ధారణ, డేటా ఎంట్రీ వాటిపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కొనుగోలు సమయానికి తేమ యంత్రాలు, సంచులు అన్ని అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. కేంద్రాల్లో సమస్యలు రాకుండా, సజావుగా సాగేలా చూసుకోవాలని సూచించారు.

సేవలు స్ఫూర్తిదాయకం

సర్పవరం జంక్షన్, : కూలి పనులు చేసుకుంటూ వచ్చే దినసరి వేతనంతో 'మీకోసం స్వచ్ఛంద సంస్థ' పేరుతో సేవాకార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఐడీపీ రాష్ట్ర కన్వీనర్ డా.అడ్డాల సత్యనారాయణ అన్నారు. రమణయ్యపేటలో ఆయన చేతుల మీదుగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు (హెచ్ఐవీ) నిత్యవసర సరుకులు బుధవారం అందించారు. అధ్యక్షుడు పిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కరప, న్యూస్‌టుడే: ఫీల్డ్ అసిస్టెంట్ పులపకూర సునీతను వేధింపులకు గురిచేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేలా చేసిన బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా నాయకులు టి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పెనుగుదురుకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ సునీతను బుధవారం ఆయన ఆ సంఘ నాయకులు విప్పర్తి శ్రీనివాసరావు, జక్కల చిన్నారి, డి.అద్భుతదీపుడు తదితరులతో కలిసి పరామర్శించారు. ఆమెను వేధింపులకు గురిచేసి కాకుండా కుల వివక్షతతో అవమానపరిచిన వ్యక్తులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.


చికిత్స పొందుతున్న సునీతను పరామర్శిస్తున్న నాయకులు

కార్పొరేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం కూల్చివేత

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ అర్బన్ 50వ డివిజన్ గైగోలుపాడు కూడలిలో కార్పొరేషన్ స్థలం ఆక్రమించి షాపు నిర్మాణం చేపట్టడంతో అధికారులు బుధవారం కూల్చివేయించారు. గైగోలుపాడు కూడలిలోని విజేత షాపింగ్ మాల్ ఆవరణలో కార్పొరేషన్ స్థలంలో ప్రధాన రహదారి పక్కన జ్యూస్ షాపు పెట్టడానికి అక్రమంగా నిర్మాణం చేపట్టారు. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావుకు ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆయన స్పందించి సచివాలయ ప్లానింగ్ అధికారి ప్రసాద్‌ను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రసాద్ సిబ్బందితో వెళ్లి పరిశీలించి కూల్చివేయించారు.

పశువ్యాధుల నిర్ధారణకే వైద్యపరీక్షలు

కాజులూరు, న్యూస్‌టుడే: పశువ్యాధుల నిర్ధారణకే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు చింతా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని దుగ్గుదూరు, కోలంక పశువైద్యశాల పరిధిలో దుగ్గుదూరు, కుయ్యేరు, ఉప్పుమిల్లి, కోలంక, నామవానిపాలెం, పెదలంక గ్రామాల్లో రైతు క్షేత్రాలకు వెళ్లి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా దుగ్గుదూరులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో పశువులకు వ్యాధులు సంక్రమిస్తున్నాయని ఈ వ్యాధులు ఏ రకంగా వస్తున్నాయనేది గుర్తించేందుకు ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షల్లో కె.రామకోటేశ్వరరావు, సిబ్బంది సత్యనారాయణ, అరుణ్‌కుమార్, వి.దుర్గాప్రసాద్, సుష్మ, గంగా, ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.


పశువులకు రక్త నమూలనాలను సేకరిస్తున్న సిబ్బంది

పర్యాటకశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: అమరావతిలోని ఏపీ సచివాలయంలో బుధవారం రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కాకినాడ గ్రామీణం జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పర్యాటక ప్రాజెక్టులపై చర్చించారు. కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట సముద్రతీరంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహణ, ఎన్టీఆర్ బీచ్‌పార్కు అభివృద్ధి, హరిత రిసార్ట్స్, జిల్లాలో ప్రముఖ దేవాలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. ● నూతనంగా రాష్ట్ర టిడ్కో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జనసేన నాయకుడు, వేములపాటి అజయ్‌కుమార్‌ను విజయవాడలోని ఏపీ టిడ్కో కార్యాలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

తాళ్లరేవు: తాళ్లరేవు, పల్లిపాలెం, గాడిమొగ ఫీడర్ విద్యుత్తు లైన్లపై చెట్టు కొమ్మల తొలగింపు నిమిత్తం ఈ నెల 25న విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ ఎన్.ఉదయభాస్కర్ తెలిపారు. ఆ రోజు తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తాళ్లరేవు, మల్లవరం, జార్జిపేట, నీలపల్లి, గాడిమొగ, భైరవపాలెం, పోలేకుర్రు సీతారామపురం, కోరంగి, పెద, చినబొడ్డువెంకటాయపాలెం గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

పెదపూడి: పెదపూడి మండలంలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని కాకినాడ విద్యుత్తు శాఖ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.మామిడాడ ఉప విద్యుత్తు పరిధిలోని పైన, రాజుపాలెం, జి.మామిడాడ, గండ్రేడు, వేండ్ర, పెద్దాడ, గ్రామాలతో పాటు ఆక్వా కల్చరుకు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు మరమత్తుల నిమిత్తం అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

పెద్దాపురం: పెద్దాపురం మండలం దివిలి విద్యుత్తు ఉపకేంద్రంలో వార్షిక మరమ్మతులతో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ ప్రభాకర్ పేర్కొన్నారు. చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మర్లావ, తూర్పుపాకలు గ్రామాల్లో కోత ఉంటుందన్నారు.

పరిహారం అందని రైతుల ఆగ్రహం

గొల్లప్రోలు: ఏలేరు వరద ముంపునకు గురై పంట నష్టం వాటిల్లినా ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం మంజూరుకాకపోవడంపై చేబ్రోలు, లక్ష్మీపురం ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఈ రెండు గ్రామాలకు చెందిన రైతులు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మను బుధవారం కలిసి పరిహారం అందలేదని వివరించారు. దీంతో ఆయన వ్యవసాయశాఖ అధికారులను ఫోన్ ద్వారా వివరాలు తెలిపి పంట నష్టం అందని బాధిత రైతుల జాబితా రూపొందించాలని ఆదేశించారు. దీంతో చేబ్రోలులోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జి ఏడీ జోగిరాజు, ఏవో సత్యనారాయణ రైతుల వివరాలు సేకరించారు. తమకు నష్ట పరిహారం అందలేదని, కొందరికి పంట నష్టం జరగకున్నా సాయం అందిందని తెలిపారు. ఈ మేరకు విచారణ నిర్వహిస్తామని అధికారులు వివరించారు. పంట నష్టం అందించకుంటే ఆందోళన చేపడతామని బాధిత రైతులు హెచ్చరించారు.

పొలాల్లో ఇసుక మేటలను తక్షణమే తొలగించాలి

పిఠాపురం, న్యూస్‌టుడే: ఇటీవల వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల స్థాయి రెండో మహాసభ బుధవారం లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో సీపీఎం పట్టణ నాయకుడు కోనేటి రాజు అధ్యక్షతన జరిగింది. జిల్లా నాయకులు రాజశేఖర్, డీఎస్ బాబ్జీ, కరణం ప్రసాద్ మాట్లాడుతూ.. ఏలేరు వరదలకు రూ.10వేలు పరిహారం మాత్రమే ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అది కూడా కొంత మంది రైతులకే ఇచ్చారని ఆరోపించారు. ఇసుక మేటలను తక్షణమే తొలగించి, ఆయా పొలాలు మళ్లీ వ్యవసాయానికి అనుకూలంగా మార్చాలన్నారు. ఉచిత ఇసుక ఎవరికీ అందడం లేదన్నారు. విద్యుత్ ట్రూఆఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడాన్ని ఖండించారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.నాగేశ్వరరావు, కె.విశ్వనాథం, సూర్యనారాయణ, నందీశ్వరరావు, శీరందాసు రాజేష్, గోపాలకృష్ణ, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్‌గా కుంచే చిన్న, సభ్యులుగా కోనేటి రాజు, కె.మణి, కె.నాగేశ్వరరావు, మణికంఠ, డి.తులసీ, జి.వీరబాబులను ఎన్నుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రేపు ఉద్యోగ మేళా

పిఠాపురం: పిఠాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 25న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండలరావు, జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. డిగ్రీ, డిప్లొమో పూర్తి చేసి 19 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 86399 51411, 99491 56583 నంబర్లను సంప్రదించాలన్నారు.

వారపు సంతలో మెప్మా బజార్

సామర్లకోట: సామర్లకోట పట్టణం వారపు సంతలో బుధవారం మెప్మా బజార్ దుకాణాను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను విక్రయించేందుకు ఇన్‌ఛార్జి మెప్మా టీఎంఎం ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలను పురపాలక సంఘ కమిషనర్ శ్రీవిద్య పరిశీలించారు. మెప్మా సీవో వెంకటలక్ష్మి, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం ఏర్పాటుకు పరిశీలన

గొల్లప్రోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు గొల్లప్రోలు మండలం తాటిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఇక్కడ పరీక్షా కేంద్రం ఏర్పాటుచేయడం ద్వారా అయిదు గ్రామాలకు చెందిన 250 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని ఇటీవల పర్యటించిన ఉపముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవించారు. దీంతో కాకినాడ డీవైఈవో కె.సత్యనారాయణ, ఇతర అధికారులు పరిశీలించారు.

దరఖాస్తుల స్వీకరణ

పిఠాపురం: ఉభయ గోదావరి పట్టాభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దారు పీవీవీ గోపాల కృష్ణ తెలిపారు. బుధవారం నాటికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో సుమారు 700 పైగా దరఖాస్తులు అందాయన్నారు.

అవీ ఇవీ అన్నీ

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కొత్తపల్లి: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎస్టీయూ నాయకులు ఎంఈవో వేణుగోపాలరావుకి వినతిపత్రం అందించారు. ఇంక్రిమెంట్ మంజూరు తదితర సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు.

బాలకార్మికులను గుర్తించేందుకు తనిఖీలు

గొల్లప్రోలు: బాలకార్మికులను గుర్తించేందుకు గొల్లప్రోలులోని వివిధ దుకాణాలు, మెకానిక్ షెడ్లు, ఇతర వ్యాపార సంస్థల్లో అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. లేబర్ ఇన్‌స్పెక్టర్లు, వైద్యులు బృందాలుగా తనిఖీలు కొనసాగించారు. బాలలతో పనిచేయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను అధికారులు హెచ్చరించారు.

అర్హులైన వారికే ప్రాధాన్యత ఇవ్వాలి

సామర్లకోట గ్రామీణం: విశ్వకర్మ యోజన పథకానికి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని భాజపా పెద్దాపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి విత్తనాల వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని వి.కె.రాయపురం, బోయినపూడి, మాధవపట్నం, పనసపాడు పంచాయతీలను సందర్శించి విశ్వకర్మ యోజన దరఖాస్తుల వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకంలో దరఖాస్తు చేసుకున్న వారిలో కుల వృత్తుల వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భాజపా రూరల్ జనరల్ సెక్రటరీ వెంకటప్రసాద్, సూరిబాబు, అచ్చారావు పాల్గొన్నారు.

హర్షకుమార్ పుట్టిన రోజు వేడుకలు

తాళ్లరేవు: అమలాపురం మాజీ ఎంపీ జి.వి.కుమార్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం తాళ్లరేవు, సీతారామపురం గ్రామాల్లో నిర్వహించారు. తాళ్లరేవు సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. దడాల బుజ్జిబాబు, మారెళ్ల వెంకటరమణ, బీర కృష్ణ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపిక


విద్యార్థి సాత్విక్‌తో అధ్యాపక సిబ్బంది

గండేపల్లి, న్యూస్‌టుడే: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఈసీఈ చదువుతున్న సాత్విక్ జేఎన్‌టీయూకే బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 26 నుంచి 29 వరకు చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో సాత్విక్ పాల్గొంటాడని వివరించారు.

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

టిడ్కో ఛైర్మన్ ప్రమాణ స్వీకారానికి హాజరు


అజయ్‌తో జనసేన నాయకుడు తుమ్మలపల్లి రమేష్

గండేపల్లి (జగ్గంపేట) న్యూస్‌టుడే: విజయవాడలో బుధవారం టిడ్కో ఛైర్మన్‌గా వేములపాటి అజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అజయ్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వీరబాబు, ప్రసాద్, బాబి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పించుకు వెళ్లడం కష్టమే

గుంతల రోడ్డుపై ప్రమాదకర ప్రయాణం

న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం: నిత్యం వాహనాల రద్దీతో కనిపించే రోడ్లు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. గుంతలు పడి ధ్వంసమై.. తారుచెదిరిపోయిన రోడ్లపై వాహనదారులు తీవ్ర అవస్థల మధ్య ప్రయాణం చేస్తున్నారు. పది కిలోమీటర్ల దూరం ప్రయాణానికి గంటకుపైగా పడుతుండడంతో, గమ్యం చేరేందుకు గంట ముందే ఇంటి నుంచి బయలుదేరాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. రోడ్డు పొడవునా పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, పగలే పూట ఎలాగో తప్పించుకుని వెళుతున్నా.. రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఆటోలు, బస్సులు గుంతల రోడ్లోంచి బయటకు వచ్చేందుకు ఆగుతూ.. ఊగుతూ వెళుతుంటే దూరం నుంచి చూస్తున్నవారికే గుండెదడ పెరుగుతోంది. ఇక ప్రయాణాలు సాగించేవారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని గాలిలో ప్రయాణిస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు. కాట్రావులపల్లి జంక్షన్‌లో ఏర్పడిన గుంత వద్ద ట్రాఫిక్ కోన్ పెట్టి వాహనదారులను హెచ్చరిస్తున్నా దగ్గరికి వచ్చే వరకు అది కనిపించక ప్రమాదాల బారినపడుతున్నారు. సీతానగరం వద్ద మలుపులోని గుంత ప్రయాణికులకు వణుకు పుట్టిస్తోంది. గోకవరం రోడ్డులో మాటలగుంట మలుపు వద్ద రోడ్డంతా గుంతలుపడడంతో వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతుండగా వెనుక నుంచి వచ్చే వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్నారు.


కాట్రావులపల్లిలో రోడ్డుపై గుంత వద్ద పెట్టిన కోన్


సీతానగరంలో ఆటో పాట్లు

నిధులు మంజూరైతే..

గుంతల రోడ్లపై ప్రమాదకర ప్రయాణంపై రహదారులు, భవనాల శాఖ డీఈఈ రామారావును వివరణ కోరగా రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రణాళికలు పంపించామని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని వివరించారు.

మాలధారణం.. నియమాల తోరణం

అయ్యప్ప స్వాములతో ఆధ్యాత్మిక శోభ

న్యూస్‌టుడే, తుని, తుని పట్టణం

తాండవ నది ఒడ్డున ఉన్న కట్టాకోండం దగ్గర ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. తాజాగా మాలధారుల కోసం అన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది.

పుష్కరకాలంగా ఉచిత అన్నప్రసాద వితరణ

దాతల సహకారంతో శ్రీశివ దుర్గా అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా ఏటా ఉచిత అన్నప్రసాద వితరణను 64 రోజుల పాటు నిర్విరామంగా చేస్తున్నారు. మాలలు ధరించిన సుమారు 600 మంది భక్తులకు తుని పట్టణంలో కట్టాకోండపై రోజూ మధ్యాహ్న వేళలో భిక్షలందిస్తున్నారు. రుద్రాక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో గవరపేటలో నాలుగేళ్లుగా ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.


మాలధారులకు భిక్ష అందిస్తున్న నిర్వాహకులు

ఇబ్బంది లేదు..

వివిధ అవసరాల నిమిత్తం తుని వచ్చే మాలధారులకు మధ్యాహ్నం వేళలో భిక్ష కోసం వెతుక్కోకుండా కట్టాకోండపై భిక్ష అందిస్తున్నారు. ఈ అన్నప్రసాద వితరణ ఏటా ఇలానే కొనసాగాలని కోరుకుంటున్నాం.

- జి.సురేష్, మాలధారుడు, తుని

ఏటా కార్తికమాసంలో ఏర్పాట్లు..

రుద్రాక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకూ పట్టణంలోని గవరపేట సామాజిక భవనంలో ఏర్పాట్లు చేశాం. రోజుకు 400 మంది మాలధారులకు అన్నప్రసాదం అందిస్తాం.

- కె.సత్యనారాయణ, నిర్వాహకుడు, తుని

రమణయ్యపేట రోడ్డు మరమ్మతులకు నిధులు

ఈనాడు కథనానికి స్పందన

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు ర.భ.శాఖ రహదారి అభివృద్ధికి మార్గం సుగమమైంది. కాకినాడ జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాలను అనుసంధానం చేసే ఈ రహదారి దాదాపు 13 కిలోమీటర్ల పొడవునా తీవ్రంగా దెబ్బతింది. ఆయా చోట్ల ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వివరిస్తూ 'ప్రాణసంకటంగా ప్రయాణాలు' శీర్షికన 'ఈనాడు'లో సోమ, మంగళవారాల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ప్రయాణికుల వెతలను తీర్చేందుకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్పందించారు. జిల్లా అధికారులతో మాట్లాడి సత్వరమే నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి బుధవారం చెప్పారు. ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రోడ్డు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తారని వెల్లడించారు. రహదారి పునఃనిర్మాణానికి నిధులు విడుదల చేయించేందుకు ఎమ్మెల్యే సత్యప్రభ కృషి చేస్తున్నారని వివరించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, తెదేపా మండల కన్వీనర్ సూతి బూరయ, పార్టీ నాయకులు కొప్పుల బాబ్జి, నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ప్రతిభ పోటీలో మేటి

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీప్రకాష్ స్కూలులో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో వివిధ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలోచనా శక్తిని చాటి.. మేధస్సుతో ప్రతిభచూపారు. 'ఇంటర్నెట్ వినియోగంతో ఎదురయ్యే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో తమ అభిప్రాయాలు స్పష్టంగా వ్యక్తం చేశారు. ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సామాజిక మాధ్యమాలను విషయ పరిజ్ఞానం పెంపునకు ఉపయోగించాలని చాటిచెప్పారు. తప్పుదోవ పట్టించేలా ఉపయోగించేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపికచేశారు. పోటీల్లో ఎస్.లాస్యత్రివేణి (8వ తరగతి), డి.అమృతశ్రీ (9వ తరగతి), ఎస్.సత్యశ్రీ అశ్విత (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. హెచ్ఎం బి.సీతారాణి, సీబీఎస్ఈ ప్రొక్టర్ బి.ప్రసూనమౌళి, ఉపాధ్యాయుడు వై.సురేష్‌కుమార్ విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు.


వ్యాసరచన పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందించిన ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

అయ్యప్ప భక్తులకు ప్రసాద వితరణ

శంఖవరం, న్యూస్‌టుడే: అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులకు చేతనైన సాయాన్ని అందించేందుకు శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన అయ్యప్ప సేవా సమితి ముందుకొచ్చింది. దీక్షధారణతో 41 రోజులు స్వాములకు భిక్షను సమితి సభ్యులు అందిస్తున్నారు. అయ్యప్ప దీక్ష స్వీకరించిన భక్తులతో పాటు శివ, సత్యదేవ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దీక్షధారులకు రోజూ మధ్యాహ్న సమయంలో అయ్యప్ప సేవా సమితి, దాతల సహకారంతో అన్నప్రసాదం సమకూరుస్తున్నారు. నిత్యం దాదాపు 400 మందికిపైగా స్వాములకు భిక్ష అందిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

రౌతులపూడి: రౌతులపూడిలోని దుర్గాదేవి ఆలయంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీశ్రీనివాసా వర్తక సంఘం సభ్యులు సహకారం అందించారు.

సత్యదేవుని దీక్షావస్త్రాల పంపిణీ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దీక్షలు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని సత్యదీక్షా ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలిపారు. మండలంలోని గెద్దనాపల్లి, వేలంక, కిర్లంపూడి, బూరుగుపూడి గ్రామాల్లో బుధవారం సత్యదీక్షపై ఆయన ప్రచారం నిర్వహించారు. దీక్షలు చేపట్టేందుకు ముందుకువచ్చిన భక్తులకు వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయ అధికారులు సమకూర్చిన వస్త్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈనెల 27 నుంచి 27 రోజుల పాటు స్వామివారి దీక్ష ఆచరించాలని వివరించారు. జీవితంలో ఒక్కసారైనా దీక్ష బూని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులుకావాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


భక్తులకు వస్త్రాలు అందిస్తున్న కృష్ణబాబు

సైబర్ నేరాలపై అప్రమత్తం

తుని గ్రామీణం (కోటనందూరు), న్యూస్‌టుడే: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు స్థానికులను అప్రమత్తం చేసేందుకు కృషి చేయాలని కోటనందూరు ఎస్సై రామకృష్ణ సూచించారు. మండలంలోని మదర్ విద్యా సంస్థల్లో బుధవారం సైబర్ నేరాలపై ఆయన విదార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో రుణాల మంజూరు యాప్స్‌ను ఆశ్రయించవద్దని సూచించారు. తెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పకూడదని, వ్యక్తిగత విషయాలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయవద్దని కోరారు. వాటి సాయంతో బ్యాంకు ఖాతాల్లోని నగదును అపహరించే అవకాశం ఉందన్నారు. బాధితులు తక్షణం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారి నష్టాన్ని తగ్గించడానికి, రికవరీకి సైబర్ క్రైం సిబ్బంది సహకరిస్తారని వివరించారు. కార్యక్రమంలో మదర్ విద్యాసంస్థల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

25న జగ్గంపేటలో ఉపాధి మేళా

గండేపల్లి (జగ్గంపేట)న్యూస్‌టుడే: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మేళా నిర్వహిస్తామని వివరించారు. ఎల్అండ్‌టీ ఫైనాన్స్, ఇన్నోవా సోర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ప్రై).లి. అధికారులు హాజరవుతారని, డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసిన 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయసున్న అభ్యర్థులు అర్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

వీధిదీపాలు వెలిగాయి..

శంఖవరం: మండలంలోని కత్తిపూడి కొండవారిపేటలో వీధి దీపాలు వెలగక చీకటిలో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సమస్యను 'ఈనాడు-మీతోడు' దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి భవానీశంకర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. సిబ్బందితో దీపాలు ఏర్పాటు చేయించారు.

జగ్గంపేట గ్రామీణం: రాజపూడిలోని పలు వీధుల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. నరసరావుపేట, సంతమార్కెట్‌వీధి, శివాలయంవీధిలో రాత్రిపూట కుక్కల బెడద ఎక్కువగా ఉందని కాలనీవాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను సర్పంచి విష్ణుమూర్తి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి మరమ్మతులు చేపట్టి వీధి దీపాలు వెలిగించారు.

మంచినీటి ట్యాంకు పరిసరాలు శుభ్రం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రాజపూడి శివారు సీతారాంపురంలో మంచినీటి ట్యాంకు వద్ద పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న జీఎల్ఆర్ ట్యాంకు చుట్టూ నాచు పేరుకుపోయింది. ట్యాంకు చుట్టూ మురుగు చేరి అధ్వానంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. సమస్యను సర్పంచి విష్ణుమూర్తి దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో ట్యాంకు చుట్టూ బ్లీచింగ్ వేసి శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం గ్రామ శివారు మామిడితోటలో గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై హరిబాబు తెలిపారు. సత్యసాయి స్కూల్ ఎదురుగా తోటలో మృతదేహాన్ని గుర్తించామన్నారు. మామిడిచెట్టుకు చీరతో మూడు రోజుల క్రితమే ఉరివేసుకున్నాడని తెలిపారు. మృతుడు ఎవరు, ఏ ప్రాంతానికి చెందినవాడనే వివరాలు తెలియలేదన్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, గుండుతో ఉన్నాడని వివరించారు.

15 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

గండేపల్లి, న్యూస్‌టుడే: సారా తయారుచేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు, 15 లీటర్ల సరకు స్వాధీనం చేసుకున్నట్లు గండేపల్లి ఎస్సై శివనాగబాబు తెలిపారు. గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామ శివారులో సారా కాస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి అతని వద్ద ఉన్న 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు.

రోడ్డు కోత.. పొంచి ఉన్న ప్రమాదం


రాజుపాలెం-ముక్కొల్లు రోడ్డు ఇలా..

రాజుపాలెం- ముక్కొల్లు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. రాజుపాలెం కాలనీ దాటిన తరువాత వాలుకాలువ వంతెన మధ్య నున్న ప్రదేశం పంటకాలువ చెంతన ఉన్న మట్టి గట్టు భారీ వర్షాలు, వరదల ప్రభావానికి పూర్తిగా కొట్టుకుపోయింది. రోడ్డుకు రెండువైపులా పంట కాలువలు ఉండడం రోడ్డు కూడా కోతకు గురై కొట్టుకు పోవడంతో కనీస వెడల్పు లేకుండా మారింది. దీంతో రాత్రి సమయాల్లో రాజుపాలెం నుంచి ముక్కొల్లు వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో ఉన్న రోడ్డు కోతకు గురైన ప్రదేశంలో రక్షణ గోడ నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కిర్లంపూడి

సామాజిక తనిఖీ గ్రామసభ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: జగపతినగరం పంచాయతీ పరిధిలోని ఏడాది కాలంగా ఉపాధి హామీ, ఇతర పథకాల్లో చేపట్టిన పనులు, ప్రజలకు అందించిన పథకాలపై సామాజిక తనిఖీ గ్రామసభను బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. సర్పంచి మహేంద్రాడ శ్రీలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధి హామీ పనులపై పలువురు గ్రామస్థులు ప్రశ్నలు సంధించారు. కార్యక్రమంలో ఏపీవో నాయుడు, డీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

● మండలంలోని రాజుపాలెం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద భూముల రీసర్వే సమస్యల పరిష్కారానికి బుధవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచి గోడే సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రీసర్వే సమస్యలపై అధికారులకు రైతులు అర్జీలు అందించారు. ఈసందర్భంగా తహసీల్దారు జె.చిరంజీవి మాట్లాడుతూ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రీసర్వే ఉప తహసీల్దారు శ్రావణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సత్యాదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఉప తహసీల్దార్ కిరణ్‌కుమార్ గ్రామస్థుల నుంచి భూ సమస్యలపై 35 వినతులు స్వీకరించారు. త్వరలోనే ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఈగల విజయదుర్గ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్‌తో ఉపయోగాలను వివరిస్తున్న ఏవో అశోక్‌కుమార్

డ్రోన్ల వినియోగంపై అవగాహన

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో తక్కువ సమయం, తక్కువ ఖర్చుతో పలు రకాల పనులు పూర్తిచేయవచ్చని మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ చెప్పారు. హంసవరం, హెచ్.కొత్తూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. పురుగుమందుల పిచికారీలో డ్రోన్ల వినియోగంపై క్షేత్రస్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. త్వరలో విత్తనాలు నాటే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి మేరీ అవినాష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సమగ్ర ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని పేరవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి బి.జ్యోతి మాట్లాడుతూ సాగులో ప్రారంభం నుంచి పంట చేతికొచ్చే వరకు సమగ్ర ఎరువుల యాజమాన్య విధానాలు అనుసరించాలన్నారు. జీవన ఎరువుల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చేయించి చూపారు. రసాయనిక ఎరువులతో కలవకుండా జీవన ఎరువులను వేర్వేరుగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి శ్రీవల్లి, కర్రి సుబ్బారావు, చెరకు శ్రీను, వేమగిరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.


పేరవరంలో జీవన ఎరువు తయారు చేయిస్తున్న ఏలేశ్వరం ఏవో

రసాయనేతర సాగుతో నాణ్యమైన పంటలు

కిర్లంపూడి: పంటల సాగులో రసాయనేతర పద్ధతులు పాటిస్తూ నాణ్యమైన దిగుబడి సాధించేందుకు రైతులు ముందుకు సాగాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టరు హరి కోరారు. సింహాద్రిపురం గ్రామంలో పొలం పిలుస్తోందిలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జోకా అమృత అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరిలో వివిధ పురుగులు, సోకుతున్న తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన సస్యరక్షణ విధానాలను శాస్త్రవేత్తలు, అధికారులు వివరించారు. నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టరు వరప్రసాద్, పెద్దాపురం ఏడీ దైవకుమార్, డీఆర్సీ వ్యవసాయాధికారి సంజీవ్, వ్యవసాయ సహాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

జగ్గంపేట గ్రామీణం: రైతుల భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.వి.ఆర్.రమేష్ అన్నారు. మండలంలోని సీతానగరంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రీసర్వేలో ఎలాంటి సమస్యలున్నా రైతులు దరఖాస్తు చేసుకోవాలని, 15 రోజుల్లో పర్కిరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో 40 మంది రైతులు సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

జగ్గంపేట గ్రామీణం: ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎన్.మల్లికార్జునరావు కోరారు. మండలంలోని రాజపూడి, జె.కొత్తూరులో బుధవారం ఆయన పర్యటించి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పామాయిల్, భూమి విస్తరణ పథకం, కూరగాయల పెంపకం, విడి పూలసాగు, డ్రిప్, స్ప్రింక్లర్లు వేసుకునే రైతులకు అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి పి.లావణ్య, క్షేత్రస్థాయి సిబ్బంది షాలిని, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థి ప్రతిభ

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వి.కొత్తూరు పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అన్నవరపు దుర్గాప్రసాద్ తైక్వాండో పోటీల్లో రజత పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ లలిత తెలిపారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ స్థాయి ఎంపికలు, 54 కిలోల విభాగంలో బుధవారం కాకినాడలో నిర్వహించిన పోటీల్లో దుర్గాప్రసాద్ ద్వితీయస్థానంలో నిలిచాడని వివరించారు. పీడీ రాజేష్‌కుమార్, కోచ్ కేవీ సత్యనారాయణను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.


పతకం సాధించిన విద్యార్థి దుర్గాప్రసాద్

మహిళా పోలీసుల భవిష్యత్తుపై దృష్టి సారించాలి

గండేపల్లి (జగ్గంపేట) న్యూస్‌టుడే: సచివాలయ మహిళా పోలీసుల భవిష్యత్తుపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించి న్యాయం చెయ్యాలని రాష్ట్ర మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు నాగమణి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంబంధం లేని జాబ్ ఛార్ట్, సచివాలయంలో సెలవుల మంజూరులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. కొందరు వేసిన కోర్టు కేసు కారణంగా జాబ్‌ఛార్ట్, మాతృ సంస్థ, పదోన్నతుల విషయంలో స్పష్టత లేదని, కూటమి ప్రభుత్వం దృష్టిసారించి న్యాయం చేయాలని కోరారు.

బడి వాకిట్లో పాఠాలు

న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

పాఠశాలల్లో శిథిల భవనాలు ఇప్పటికీ అలాగే మిగిలే ఉన్నాయి. గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో ఇలాంటి పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. విద్యార్థుల సంఖ్య తక్కువే ఉన్నా.. కాలంచెల్లిన భవనాల చెంత నిత్యం గడపడం ఇబ్బందిగానే ఉంటోంది. మండలంలోని ఇ.గోకవరం, పి.జగన్నాథపురం గ్రామాల్లో ఇదే పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది. ఇ.గోకవరంలో అయిదు తరగతుల్లోనూ 42 మంది చదువుతుండగా రెండు గదులున్న భవనంలో పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల శిథిలయం కావడంతో చెట్ల కింద తరగతులు తప్పడం లేదు. ఈ పాఠశాల ఆవరణలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం చూడడానికి బాగానే ఉన్నా స్లాబు పెచ్చులు ఊడిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. భవనాన్ని తొలగించాలని చాన్నాళ్ల క్రితమే ఇంజినీర్లు నిర్ణయించారు. అయితే కూలదోయకుండా పార్కింగ్ టైల్స్‌లో నడకబాట వేసి, ఒక భవనానికి మరమ్మతులు చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. శిథిల భవనం వరకు పిల్లలను వెళ్లనీయకుండా కాపలా కాయడం ఉపాధ్యాయులకు నిత్యం సవాలుగానే మారుతోంది. పి.జగన్నాథపురం ఎంపీపీ పాఠశాలలో 10 మంది విద్యార్థులు చదువుతుండగా అక్కడ వసతులు సరిపోతున్నాయి. కాలం చెల్లిన రేకుల షెడ్డును మాత్రం అలాగే వదిలేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాడకంలో లేని పాత భవనాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో రాజబాబు వివరణ ఇచ్చారు.


వసతి చాలక ఆవరణలో విద్యార్థులు


పి.జగన్నాథపురంలో కాలం చెల్లిన రేకుల షెడ్డు

వంతెన నిర్వహణ ఇలాగేనా..?


గుర్రంపాలెం రోడ్డు.. పోలవరం వంతెనపై నిలిచిన నీరు

పోలవరం, పుష్కర కాలువ వంతెనపై మట్టి దిబ్బలు పేరుకుపోయి, వర్షపునీరు పోయే మార్గాలు మూసుకుపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై పెద్దపెద్ద గోతులు పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని గుర్రంపాలెం, మర్రిపాక, జె.కొత్తూరు వెళ్లే మార్గంలో వంతెనపై ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు ఈ కల్వర్టులపై పేరుకుపోయిన మట్టిదిబ్బలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం